


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

మార్చి 2020

సంపుటి : 26 **303** సంచిక : 3




# ఘోరక కలియుగం వచ్చిందా?


నిదురలో అటు ఆకాశం, ఇటు భూమీ రక్తవర్ణం కలిగి ఉన్నాయని కల కన్నాను. పట్టుమని ఇరవై ఏళ్లయినా వయసు లేని ఆ యువతీ యువకులు రెండు దోసిల్లా రక్తం త్రాగుతున్నట్టుగా దృశ్యం కనిపించింది. ఒక చేత్తో కలమో, ఒక చేత్తో హలమో పట్టవలసిన వారు రెండు చేతులా తుపాకీ పట్టారు. నూరేళ్లు బ్రతక వలసిన ప్రాణాలు పావు జీవితకాలం కూడా బ్రతకడంలేదు. వారేంవైనా అవిద్యావంతులా, బుద్ధిహీనులా – కానే కాదు.

ఏంవిటిది, ఏంవైంది వీరి సంస్కారం. ఏ చదువులను చదివారు. ఎక్కడ ఈ హింసా ప్రవృత్తిని అలవరచుకున్నారు. నీతిరహితుడూ, దుర్మార్గుడైన తండ్రి హిరణ్యకశిపునికి నీతిబోధ చేసిన దేశమిది. అలాటి యువకులు ఈ హింసాబాటను ఎన్నుకున్నందుకు కారణం ఏంవిటి? ఆ దుష్కృత్యం ప్రజా హితమా? సంపదలనూ, సంస్థలనూ, ఉద్యోగులనూ, పౌరులనూ హింసిస్తున్నవారు తిరిగి వాటిని సృజించగలరా? సృష్టిని నాశనం చేయమని ఏ మతం, ఏ వర్గం, ఏ రాజకీయం నేర్పింది. అలా నేర్పింది మతం గానీ, వర్గంగానీ, రాజకీయంగానీ ఔచిత్యం లేనిదనే చెప్పాలి. వారిని సమర్ధించే వారిని రాక్షసులనాలి.

కూడా ఔచిత్యాన్ని పాటించారేగానీ, ఇంతటి దౌష్ట్యాన్ని చేసిన దాఖలా లేదు. ఓప్రక్క మనిషి, మరోప్రక్క పంచభూత ప్రకృతీ ప్రపం చాన్ని పీడిస్తూంటే జరుగుతున్నది కలియా, ఘోరకలియా అన్నది తెలియడం లేదు.

18, 19 శతాబ్దంలో మనవారిని అన్యదేశస్థులు హింసించారు, చంపారు. ఇప్పుడు మన దేశలలో వారిని మన వారే చంపుతున్నారు. ప్రపంచంలో పెక్కు ఇస్లాము దేశాలూ, తెల్లదొరల దేశాలూ ఉన్నాయ్. కానీ ప్రపంచానికి సభ్యతా సంస్కృతిని శాస్త్రవిజ్ఞానాన్నీ నేర్పిన దేశంగా భారతదేశం ఒక్కటే ఉంది, పొరుగు దేశం నేపాల్ కూడా హైందవ సంస్కృతీ బాటలో నడుస్తోంది. ఈ దేశాల్ని ఇతర దేశ ఇష్టవిధానాల్తో హింసిస్తే ధర్మమే నశిస్తుంది.'

ఓం నమశ్శివాయ – అను షడక్షరీ మహామంత్రాన్ని జపిస్తూ – **కైవల్య మార్గదీపోయయ – విద్యా సింధు బాడబః– మహా పాతక దేవాగ్ని స్సోయం' మంత్ర షడక్షరః'** – అంటూ మహాపాతకాన్ని చేస్తూ, ఘోర కలిని సృష్టిస్తూన్న ఘోరకలిస్టులను, అజ్ఞా నాంధకారం నుంచీ దాటించి, మోక్షమార్గమును జూపమనీ శంకరుడునే వేడుకొందాం.



*బుధజన విధేయుడు*

***– గోటేటి శ్రీరామారావు***

**(జూలై 2010, ప్రముఖాంధ్ర)**

## మార్చ్ 7 , మా గోటేటి పెద్దాయన జయంతి

మధురమైన మాతృభాషను తన ప్రాణ సమానంగా ప్రేమించిన మహనీయుడూ.

ప్రముఖాంధ్ర కొనసాగినంత కాలము నా శక్తి కొనసాగుతుందని తను ఆసుపత్రిలో వున్నప్పుడు 2016 లో ప్రముఖాంధ్ర పత్రికలో రాసిన గొప్ప మనీషి.

మరి నేనో

ఆయనంత ప్రాణసమానంగా చూసుకున్న పత్రికను ఆపకూడదని అహరహము శ్రమిస్తున్నా.

ఆయనకా పత్రిక ప్రాణం

మాకు ఆయన ప్రాణం

ప్రముఖాంధ్ర పత్రికతో ప్రతీ నెలా నా వ్యాపకం ఆయనతో మాట్లాడు తున్నట్టే.

ఆయన వున్నప్పుడు మొదటి పత్రిక ఏడుకొండలవాని పాదాల దగ్గిర

మరిప్పుడో మొదటి పత్రిక ఆయన దగ్గిరుంచి తిన్నగా వెంకటరమణుని దగ్గిరకెళ్ళి ఏ సంకటాలు లేకుండా ప్రతీనెలా వచ్చేట్టు ఆశీర్వదించమని ప్రార్ధన.

ఇలా సాగుతోంది గత 15 నెలలుగా

భౌతికంగా ఆయన లేరు కాని ఆయన జ్ఞాపకాలు అరవైయేళ్ళ నా నుండి రెండేళ్ళ మునిమనవరాలి వరకు ప్రతి నిత్యం తలుచుకుంటూనే వున్నాం.

మా పెద్దాయన మా దైవం

మా ప్రాణం

మా జీవం

మా అన్నీ ఆయనే. – గోటేటి వెంకటేశ్వరరావు


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది



జడప్రాయమైన జగత్తులో కొత్త చైతన్యాన్ని కలిగించి, మానవాళిలో నూతనాశయాలను అంకురింపచేసి, ఉత్సాహం నింపే శుభదినం 'ఉగాది'. ఈ ఏడాది మార్చి 25 న శ్రీ శార్వరినామ సంవత్సర ఉగాది రానుంది.

వసంత ఋతువు వచ్చేసింది. చెట్లు కొత్త సోయగాలతో ప్రకృతికి హరితవర్ణాన్ని ఆపాదిస్తాయి. వగరు చివురులు తిన్న కోయిలలు గొంతువిప్పి, కుహూ... కుహూ రాగాలు పాడుతుంటాయి. మల్లెలు పరిమళాలను మోసుకొస్తాయి. మావిళ్ళు చిగుళ్ళు వేసి, పూత పూసి, వసంతలక్ష్మిని తోరణాలు కట్టి, ఆహ్వానిస్తాయి. ఇటువంటి వసంత ఋతువు ప్రారంభమయ్యేది చైత్రశుద్ధ పాడ్యమినాడు. ఆ రోజున అశ్వినీ నక్షత్రం ఉంటుంది.

మాసాల్లో చైత్రం, తిథుల్లో పాడ్యమి, నక్షత్రాల్లో అశ్విని మొదటిది.కాలచక్రం ఒక ఆవృతం పూర్తిచేసి మళ్లీ మొదలయ్యే రోజు ఉగాది. అందుకే, ఇది కాలానికి సంబంధించిన అతిముఖ్యమైన పండుగ. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉపయోగించే చంద్రమాన పంచాంగం ప్రకారం, మొదటి నెల చైత్రమాసం. చైత్రమాసం మొదటి రోజైన చైత్ర శుద్ధ పాడ్యమి నాడు ఉగాదిని, తెలుగువారు కొత్త సంవత్సరాదిగా జరుపుకుంటారు.

ఉగాది పండగ శాలివాహనుల కాలం నుండి ఆచరణలో ఉందని చరిత్రకారుల మాట. అప్పటి శాలివాహనుల రాజు "గౌతమీపుత్ర శాతకర్ణి"గా పేర్గాంచిన రాజా శాలివాహన ఉగాది పండగకు శ్రీకారం చుట్టారు.

### ఉగాది పండుగ ప్రాశస్త్యం:

కాలమానం ప్రకారం ఈ ధరాథలం పైనున్నభరత ఉపఖండంలో ఫాల్గుణ మాసాంతంలో శిశిర ఋతువునిష్క్రమిస్తుంది. చైత్రమాసంలో వసంతఋతు ఆగమనం ప్రారంభమవుతుంది. ప్రతీ ఏట చైత్రశుద్ధ పాడ్యమి రోజున తెలుగు సంవత్సరాదిగా ఉగాది పండుగ జరుపుకుంటాం. "ఉగ" అనగా నక్షత్ర గమనం. ఆ నక్షత్ర గమనానికి'ఆది' 'ఉగాది'! సృష్టిలోని నక్షత్ర గమనాన్ని అనుసరించి యుగారంభం అయిందనీ అదే యుగాది అనబడిందనీ వేదాలు తెలిపాయి. యుగాది అంటే యుగ ప్రారంభం అని కూడా అర్థం. మత్స్యావతారం ధరించిన విష్ణుమూర్తి రాక్షస సంహారం చేసి వేదాలను బ్రహ్మకు అప్పజెప్పిన సందర్భంగా ఉగాది జరుపుకుంటున్నట్లు పురాణగాథ ప్రచారంలో ఉంది. 6వ శతాబ్ధికి చెందిన వరాహమిహిరుడు కూడా చైత్రశుద్ధ పాడ్యమిని సంవత్సరాదిగా ప్రతిపాదించాడు.

దశావతారాల్లోని విష్ణుమశ్చ్యావతారానికి ఈ పండుగతో సంబంధం వుందని వారి విశ్వాసం! శ్రీ మహావిష్ణువు చైత్ర శుద్ధ పాడ్యమినాడే మశ్చ్యావతారాన్ని ధరించాడు. వేదాల్ని హరించిన సోమకుడనే దానవుణ్ని సంహరించటం కోసమే ఆయన ఈ అవతారాన్ని ధరించాల్సి వచ్చింది.






అదే అనుక్రమణికలో పౌరాణికంగా శ్రీరామచంద్రుడు చైత్ర మాసారంభంలోనే అవతరించాడు. చారిత్రకంగా విక్రమాదిత్యుడు ఉగాదినాడే పట్టాభిషిక్తుడయ్యాడు. అందుకే ఈ పండుగకి అంత విశిష్ఠత చేకూరింది. అంతేకాకుండా ఈ ఉగాది పండుగ పుట్టుక గురించి మరెన్నో పురాణ గాథలు ప్రచారంలో వున్నాయి.

బ్రహ్మ సృష్టిని ప్రారంభించిన చైత్రశుద్ధ పాడ్యమి రోజునే ఉగాది జరుపుకుంటున్నామని పురాణ ప్రతీతి. వేదాలను అధారం చేసుకొని వ్రాయబడిన "సూర్య సిద్ధాంతం" అనే ఖగోళ జ్యోతిష గ్రంథంలోని ఈ శ్లోకం పరిశీలించండి:

**""చైత్రమాసి జగద్బ్రహ్మ ససర్జ పథమే అహని,**
**వత్సరాదౌ వసంతాదౌ రసరాద్యే తధ్దై వచ""**

అనగా బ్రహ్మ, కల్పం ఆరంభమయే మొదటి యుగాది అంటే మొదటి సంవత్సరం (ప్రభవ)లో మొదటి ఋతువు వసంత ఋతువులో మొదటి మాసం (చైత్ర మాసం)లో మొదటి తిథి అయిన పాడ్యమి నాడు, మొదటి రోజైన ఆదివారం నాడు యావత్తు సృష్టిని ప్రభవింపజేసాడని అర్థం. అందుకే మొదటి సంవత్సరానికి "ప్రభవ" అని పేరు. చివరి అరవైయ్యోవ సంవత్సరం పేరు "క్షయ" అనగా నాశనం అని అర్థం. కల్పాంతంలో సృష్టి నాశనమయ్యేది కూడ "క్షయ" సంవత్సరంలోనే. అందుచేతనే చైత్రమాసంలో, శుక్లపక్షంలో, సూర్యోదయ సమయానికి పాడ్యమి తిథి ఉన్న రోజును యుగాదిగా, అదే ఉగాదిగా నిర్ణయించబడింది.

చైత్రం అంటేనే ప్రకృతి తన అందాలతో పురివిప్పి నాట్యమాడే కాలం. ఈ చైత్ర మాసం నుండి సూర్యభగవానుడు తన కిరణాల వాడి పెంచుతాడు. మనదేశంలో వసంత ఋతువు ప్రారంభం కాగానే నేల చిగురిస్తుంది. దాంతో పచ్చదనం విచ్చుకుంటుంది. ఆ రకంగా కొత్తయుగానికి నాంది పలికినట్లవుతుంది.

### ఉగాది రోజు ఏం చేయాలి?

ఉగాది రోజున ఉదయాన్నే ప్రతి ఒక్కరూ తైల అభ్యంగన స్నానం చేస్తారు. దీనివల్ల లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందట. కొత్త బట్టలు ధరించి, విఘ్నేశ్వరపూజతో మొదలుపెట్టి, తమ ఇష్టదైవాన్ని ధూప దీప పుష్పాలతో పూజించి, ఉగాది పచ్చడిని సేవిస్తారు. ఉగాదిరోజునాడు మామిడాకుల తోరణాలు కట్టడం, కొత్తబట్టలు

ధరించడం, పిండి వంటలు చేయడం పూర్వం నుంచీ వస్తున్న ఆచారం. ఆరోజున ఆదాయ వ్యయాలు, రాజ పూజ్య అవమానాలు, కందాయ ఫలాలు, రాశి ఫలాలు తెలియజెప్పే పంచాంగ శ్రవణం కార్యక్రమం ఓ నిర్దిష్ట ఆనవాయితిగా కొనసాగు తోంది. పల్లెల్లో కూడా రైతులు ఆరోజున దేవాలయం వద్దకి చేరి, పురోహితుడిని రప్పించి, తమ వ్యవసాయానికి ఏ కార్తెలో అనువుగా ఉంటుంది, ఎప్పుడు వర్షం పడు తుంది, ఏరువాక ఎప్పుడు కొనసాగాలి? వంటి విషయాల్ని అడిగి తెలుసు కుంటారు.

## ఉగాది పచ్చడి ప్రత్యేకత ఏంటి?

జీవితంలోని ఆరు పార్శ్వాల రుచిని చూడక తప్పదనే అంశాన్ని చెప్పకనే చెబుతుంది ఉగాది పచ్చడి. ఈ పండుగ సందర్భంగా సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలనే సందేశాన్ని యివ్వటం మాత్రమే ఈ పచ్చడి సేవన ఆచారంగా భావించబడుతోంది.

**త్వామష్ఠ శోక నరాభీష్ట**
**మధుమాస సముద్భవ**
**నిబామి శోక సంతప్తాం**
**మమ శోకం సదా కురు**

ఈ మంత్రం చదువుతూ ఉగాది పచ్చడి తినాలని శాస్త్రాలు చెప్తున్నాయి. ఉగాది పచ్చడి ఆహారంలో ఉండే ఔషధ గుణాన్ని, వృక్షసంరక్షణ అవసరాన్ని, ఆయుర్వేదానికి ఆహారానికి గల సంబంధాన్ని చెప్పడమే కాక పండుగలకు, ఆచారాలకు, సముచిత ఆహారానికి గల సంబంధాన్ని చాటిచెప్తుంది.

**బెల్లం - తీపి - ఆనందానికి సంకేతం.**
**ఉప్పు - జీవితంలో ఉత్సాహము, రుచికి సంకేతం.**
**వేప పువ్వు - చేదు - బాధకలిగించే అనుభవాలు.**
**చింతపండు - పులుపు - నేర్పుగా వ్యవహరించవలసిన పరిస్థితులు.**
**పచ్చి మామిడి ముక్కలు - వగరు - కొత్త సవాళ్లు.**
**కారం - సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులు.**

ఉగాది పచ్చడి గొప్పదనం అంతా ఇంతా కాదు. ఈ ఉగాది పచ్చడి సేవనాన్నే మన శాస్త్రాలలో 'నింబ కుసుమ భక్షణం' అని వ్యవహరిస్తారు. మనిషి ఆరోగ్యానికి కూడా ఈ ఉగాది పచ్చడి ఎంతో ఉత్తమం. వేప పువ్వులో ఉండే యాంటీ సెప్టిక్ గుణాలు క్రిములనూ, చర్మరోగాలనూ దరచేరనివ్వవు. మామిడి ముక్కలు రక్తప్రసరణ దోషాలు నివారించి వేడిని తగ్గిస్తాయి. కొత్తబెల్లం వాత పిత్త దోషాలను నివారిస్తుంది. అందుకే పెద్దలు ఈ పచ్చడిని ఈ ఒక్క రోజే కాక ఉగాది నుండి శ్రీరామనవమి వరకూ తినడం ఉత్తమమంటారు.

ఉగాది రోజున పూజ చేసుకుని, దేవుడికి నైవేద్యం పెట్టిన తర్వాత షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి తీసుకోవడం తెలుగునాట ఓ సంప్రదాయంగా వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ముత్తైదువులకు ఉగాది పచ్చడి పెట్టి, తాంబూలం ఇచ్చే ఆనవాయితీ కూడా ఉంది.

## పంచాంగ శ్రవణం ఎందుకు?

ఉగాది రోజు పంచాంగ శ్రవణం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి గ్రామంలోనూ, దేవాలయంలోనో, గ్రామ కూడలిలోనో పంచాంగ శ్రవణం చేస్తారు. పంచాంగ శ్రవణం చేసేటప్పుడు ఉత్తరాభిముఖంగా కూర్చుని వింటే మంచిదని పెద్దలంటారు. పంచాంగ శ్రవణంలో ఆ ఏడాది రాశి ఫలాలు తెలుసుకుంటారు. ఇక రైతులయితే ఏయే పంటలు వేస్తే మంచిది, ఏరువాక ఎప్పుడు సాగాలి లాంటి విషయాలు తెలుసుకుంటారు. పంచాంగ శ్రవణం చేసేవారికి, వినేవారికి నవగ్రహాలు సకల ఐశ్వర్యాలను చూకూరుస్తాయని ప్రతీతి. అంతేకాక పంచాంగ శ్రవణంతో గంగా స్నానం చేసిన పుణ్యం కూడా లభిస్తుందట.

ఉగాది రోజున పలువురు పంచాంగ కర్తలు తమ పంచాంగాలను విడుదల చేస్తారు. కొత్తపనులు మొదలు పెట్టడానికి ఉగాది శుభసూచకంగా భావిస్తారు మన తెలుగువారు. అందుకే రైతులు కొత్త బట్టలతో పొలాలకు వెళ్లి, ఒక్క చాలైనా దున్ని వస్తారు. వసంత నవరాత్రులు కూడా ఉగాదితో ప్రారంభించి, శ్రీరామ నవమి వరకు జరుపుకుంటాం. కొత్త బట్టలు, కొత్త అల్లుళ్లు, కొత్త కోడళ్లతో ఆనందంగా అందరూ ఈ పండుగ జరుపుకుంటారు. ఉగాది పండుగ నాడు ఎలావుంటే సంవత్సరం అంతా అలాగే ఉంటుందనేది మన వారికి ఒక నమ్మకం.

రబీ పంట పూర్తయ్యాక వచ్చే ఈ పండుగ కూడా రైతుల పండుగే. కర్షకుడి కష్టానికి ప్రతిఫలం దక్కిన సంతోషం ఓ పక్క.. మరో సాగుకు నిర్ణయం తీసుకునే కీలక సమయం ఓ పక్క ఉగాదిని పాత, కొత్త రోజులకు వారధిలా చేస్తుంది. ఇక పట్నపు వాసులకు పల్లె రుచి తగులుతుంది. వ్యాపారాలు, కొత్త ప్రయత్నాలకు వేదిక అవుతుందీ పండుగ.

## వివిధ ప్రాంతాల్లో ఉగాది పండుగ

ఉగాది పండుగను దేశంలోని చాలా రాష్ట్రాల్లో వివిధ పేర్లతో జరుపుకోవడం విశేషం. కర్ణాటకలోనూ ఉగాది అంటే, మహారాష్ట్రలో గుడిపాడ్వాగా పిలుస్తారు. రాజస్థాన్‌లోని మార్వాడీలు థాపన పేరుతో పండుగ చేసుకుంటే సింధీలు చేటీ చాంద్‌గా ఫెస్టివల్ జరుపుకుంటారు. పంజాబ్‌లో బైసాకిగా, తమిళనాడులో పుత్తాండుగా వేడుకలు చేసుకుంటారు. మారిషస్‌తోపాటు హిందువులు అధికంగా ఉండే బాలీ, ఇండోనేషియాలోనూ ఉగాది రోజున కొత్త సంవత్సరాన్ని నేపీ పేరుతో జరుపుకోవడం ఆనవాయితీ.

ఇంతటి విశిష్టమైన మన ఉగాది పండుగను సంప్రదాయబద్ధంగా, ఆనందంగా జరుపుకుందాం, దైవకృపకు పాత్రులమవుదాము.


**జై శ్రీమన్నారాయణ!**

**- భావరాజు పద్మిని**









# దేవాలయమంటే ఏమిటి?

ఈ దేవాలయాలు ఎందుకు? అన్న ప్రశ్నలు తలెత్తినప్పుడు, 'దేవానాం దేవస్య వా ఆలయా' అని సమధానమిచ్చారు మన ఋషిపుంగవులు.

దేవాలయం ప్రార్థన కోసం, పూజ కోసం, దేవతా విగ్రహాలను, ఇతర ఆరాధ్య వస్తువులను ప్రతిష్ఠించి, వాటి రక్షణకోసం కట్టించిన కట్టడమే దేవాలయమని అన్నారు.

అందుకే మనవాళ్ళు దేవాలయాన్ని సప్తసంతానాలలో ఒకటిగా పేర్కొన్నారు.

కొడుకు లేక కూతురు, తటాకం, కావ్యం, విధానం, ఆలయం, వనం, భూదేవస్థాపనం అనేవి సప్తసంతానాలుగా చెప్పబడ్డాయి.

దేవాలయాన్ని దేవగృహం, దేవగార, దేవాయతనం, దేవకులం, మందిరం, భవనం, స్థానం, దేవస్థానం, వెష్మం, కీర్తనం, హర్మ్యం, విహారం అని, విమానం, ప్రాసాదం అని పిలవడం జరుగుతోంది.

మన సంస్కృతి, కళలు, శిల్పం, వాస్తు, వేదాంతం పురాణం మొదలైన వాటి సంగమ స్థానం హిందు దేవాలయం.

పరిపూర్ణమైన, సుందరమైన ఆలయమంటే మానవశరీరం. ఇక్కడ "తత్" (ఆత్మ) ఇల్లు చేసుకొని జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, పంచభూతాలు, పంచ ప్రాణాలు, పంచవిషయాలు అంతరంగ వృత్తులు (అంత: కరణ, మనస్సు, చిత్త, బుద్ధి, అహంకారాలు) తమ క్రియలను నిర్వహించడానికి అవకాశాన్ని కల్పించి ఇచ్చింది.

దేహమే దేవాలయం. దేహంలో ఉన్న జీవమే పరమత్మ. జీవాత్మ పరమాత్మకంటె వేరన్న అజ్ఞానమే నిర్మాల్యం, నేనే అతనని పూజించాలి అని అగమాలు ఘోషిస్తాయి.

## దేవాలయం ఒక దేహం లాంటిది

శిఖరం శిరస్సు,
గర్భగృహం మెడ,
ముందరి మంటపం ఉదరం,
ప్రాకారపు గోడలు కాళ్ళు,
గోపురం పాదాలు,
ధ్వజ స్తంభమే జీవితం.

ఇలా ఆలయం భగవన్మూర్తిగా భావింపబడుతోంది. అందువల్లనే దేవాలయాన్ని పవిత్రంగా భావిస్తున్నాము. ఆ స్థలాన్ని పుణ్యక్షేత్రంగా పరిగణిస్తున్నాము. అక్కడే మనం విశ్వసిస్తున్నాము.

## దేవాలయ ప్రాచీనత

భగవంతుడు లేకుండా మానవుడు జీవించలేడని, శివుని అజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనీ, అందుకనే భగవన్మూర్తిని ఒకచోట ప్రతిష్ఠించి ఆరాధిస్తున్నాము. భగవత్సాక్షాత్కారం కోసమే ప్రతి హిందువు తపన పడతాడు. ప్రయత్నిస్తాడు. అదే పవిత్ర స్థలం. అదే దేవాలయం. ఇది భౌతిక శరీరం (ఫిజికల్ బాడీ) మానసిక శరీరం (సైకిక్ బాడీ), తైజసిక శరీరాలను (సూపర్ కాన్ షియస్ బాడీ) ప్రతిబింబిచే ఒక ప్రతీక. అందువల్లనే దేవాలయం భగవంతుడికి మానవుడికి ఉన్న ఒక కొక్కీ (లింక్) అని విజ్ఞుల అభిప్రాయం.

దేవాలయ నిర్మాణం ఎప్పుడు, ఎక్కడ ఆరంభింపబడిందో చెప్పడం కష్టం. వేదకాలాల్లో దేవాలయాలు లేవనీ, విగ్రహారాధనా పద్ధతి, దేవాలయాల నిర్మాణం వేదకాలపు చివరిదశలో, రామాయణ, మహాభారత కాలల్లో ఆరంభమైందనీ, వేదకాలపు యాగశాలలే కాలక్రమంగా దేవాలయాలుగా రూపొందాయని పలువురి అభిప్రాయం.

'దేవాలయాలు వైదికయుగంలో నిర్మితములైనట్లు కనబడదు. దేవతా స్వరూపము, దేవతల వాహనములు, ప్రతిమా వర్ణనము మొదలైన విషయములకు సంబంధించిన వాక్యములు వేదములందు కొన్ని గలవు గాని, విగ్రహారాధన ఆచరణ లోనికి వచ్చిన తర్వాత గాని, దేవాలయ నిర్మాణమునకు అవకాశముండదు.

విగ్రహారాధన ఏర్పడిన వెంటనే దేవాలయ నిర్మాణము సైతము ప్రారంభింప బడినది.

బ్రహ్మస్వరూపమైన ఆత్మకు దేహము నిలయమైనట్లుగా, దేవతా విగ్రహానికి దేవాలయం నిలయముగా భావించి, దేవాలయ నిర్మాణము శరీర నిర్మాణము ననుసరించి కావించినారు.

## దేవాలయ వాస్తు

దేవాలయాలను మనం రెండువర్గాలుగా విభజించుకోవచ్చు.

1. గ్రామదేవతాలయాలు
2. శిష్టదేవతాలయాలు.

మొదటివర్గం గ్రామరక్షణ కోసం తరతరాలుగా గ్రామసంస్కృతిలో నిలద్రొక్కుకున్న ఎల్లమ్మ, గంగమ్మ, మారమ్మ, పోచమ్మ, మైసమ్మ మొదలైన దేవతల చిన్న చిన్న గుడులు.

## గ్రామదేవతలలో అధికం స్త్రీలే

ఒక విధంగా వీరు శక్తిదేవతలు. ఈ దేవాలయాల్లో చెప్పుకోదగ్గ వాస్తుశిల్పం కనపడదు. ఆలయాలు సాధారణంగా ఉంటాయి.

ఇక రెండవవర్గం బ్రహ్మ, విష్ణు, శివ, విఘ్నేశ్వర మొదలైన శిష్టదేవతల ఆలయాలు, ఈ దేవతలను పూజించేవాళ్ళు ఆగమాలలో చెప్పిన రీతిగా ఈ దేవతలకు షోడశోపచారాలు, చతుష్షష్టి ఉపచారాలు జరుగుతాయి.

శిష్టదేవాలయాలు వాస్తు శాస్త్రానుగుణంగా నిర్మించబడ్డాయి. గృహ, గ్రామ, నగర, దేవాయతన, ప్రాసాద, దుర్గ, ఆరామ, తటాక, సేతుబంధ ఇత్యాది నిర్మాణ లక్షణాలను తెలిపే శిల్పశాస్త్రమే వాస్తుశాస్త్రం. ఈ వాస్తు సంప్రదాయం ఆగమాల మీద ఆధార పడింది, ఆగమాలలో దేవాలయ నిర్మాణం, ఉత్సవాలు పేర్కొనబడ్డాయి, కామిక, కారణ ఆగమాలలో నియమ నిబంధనలు చెప్పబడ్డాయి.

వాస్తుశాస్త్రం త్రిమూర్తుల నుండి ఇంద్ర, బృహస్పతి, నారదులకు అనుగ్రహింప బడిందనీ, వాళ్ళ ద్వారా అనేక ఋషులకు సంక్రమించిదని అంటారు. పురాతన పట్టణాలు, కట్టడాలు వాస్తు శాస్త్రానుగుణంగా నిర్మింప బడుతుండేవి.

వేదకాలంలో యజ్ఞాలకోసం శాలలను, వేదికలను, ఇటుక, కొయ్య, వెదురు లతో నిర్మించేవారు. ఇవన్నీ శిల్పసూత్రాన్ని అనుసరించే నిర్మింపబడుతుండేవి.

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

bd

**Bhimas Deluxe Hotel**

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# శుభాశీస్సు

పదో తరగతి చదువుకుంటున్న రోజుల్లో ఓమారు నా పేరు అచ్చులో చూసుకోవాలనుకునే ఆశ కలిగింది. ఆ ఆశ నెరవేరాలంటే కథో కవితో ఏదో ఒకటి రాసి పంపాలి. ఏం రాయాలా అని ఆలోచించి ఆలోచించి ఓ కథ రాశాను. ఆ కథ. ఆంధ్ర పత్రికకు పంపినట్టు గుర్తు. పంపినప్పటి నుంచి పత్రిక చూడటమే కథ అచ్చయ్యిందాని. రోజులు జరిగిపోతున్నాయే తప్ప కథ అచ్చవలేదు. ఇక లాభం లేదనుకుని ఓ దుర్బుద్ధి పుట్టింది.

మా నాన్నగారికి డైరీ రాసే అలవాటుండేది. ఒకరి డైరీ లేదా ఉత్తరమో వాళ్ళ అనుమతి లేకుండా చదవకూడదనే విషయాన్ని ఆరోజు పక్కనపెట్టాను.

మా నాన్నగారు రాసుకున్న డైరీ ఒకటి ఆయనకు తెలియకుండా తీసి పేజీలు తిప్పుతుండగా "చంద మామ"పై రాసిన కవిత ఒకటి కంటపడింది. వెంటనే ఆ కవిత రాసి ఆంధ్రపత్రికకు పంపుతూ ఈ కవిత నా సొంతం, మరే పత్రికకూ పంపలేదంటూ పోస్ట్ చేసాను.

ఓ వారానికల్లా ఆ కవిత నా పేరిట ఆంధ్రపత్రిక సంపాదకీయ పేజీలో అచ్చయ్యింది. నా పేరు మీద ఓ దినపత్రికలో అచ్చయిన తొలి కవిత అది. నిజానికి అది నేను రాసింది కాదు. మా నాన్నగారి రచన. ఇదేదో బాగుందనుకుని మరికొన్ని కవితలు తస్కరించి పంపాలనే ఆశ పుట్టింది. కానీ ఆ ఆశకు ఆరోజే తెర దించాల్సి వచ్చింది. కారణం, నాటి ఆంధ్రపత్రి కంతా చదివిన మా నాన్నగారి కళ్ళు ఈ చందమామ కవిత దగ్గర ఆగాయి. చదివారు. మరుక్షణం నన్ను పిలిచి హెచ్చరించారు.

"ఇదేంట్రా ఇది నేను రాసిన కవితరా...పైగా ఎప్పుడో అచ్చయినదే" అంటూ "నా కవితను నువ్విలా కాపీ చేసి నీ పేరుతో పంపడం సముచితం కాదురా... అటువంటి పని ఇంకోసారి చేయకు. నీకవసరమైతే నేనేదైనా రాసి నీ పేరుమీద పంపుతానులే" అని చెప్పడంతో ఆయన రచనలను దొంగిలించి పంపాలన్న ఆలోచనకు స్వస్తి పలికాను. అయితే ఆ కవితల డైరీ దొరుకుతుందేమోనని నిన్న వెతుకుతుంటే "హీరో చిరంజీవి - సురేఖ" ల పెళ్ళికి మా నాన్నగారు రాసిన "శుభాశీస్సు" పద్యాలు దొరికాయి. మా నాన్నగారి శిష్యురాలే అల్లు రామలింగయ్యగారి కుమార్తె సురేఖ.

ఎవరైనా పెళ్ళికో ఉపనయనానికో పిలిస్తే ఆ శుభకార్యక్రమానికి వెళ్ళి పద్యాలు చదవడం మా నాన్నగారి అలవాటు. అయిదు పద్యాలు రాసి అవి ముద్రించి ఫ్రేమ్ కట్టి ఇచ్చేవారు. అంతేకాదు, ముద్రిత పద్యాల కాగితాలను అక్కడికి వచ్చినవారికి పంచేవారు. అలా సురేఖ పెళ్ళికి రాసిన పద్యాలు ఈ కింద ఇచ్చాను....

1


**శ్రీ శుభంకరి శాంకరి చిన్నినవ్వు**
**శ్రీ సురేఖా చిరంజీవి భాసురప్ర**
**మోద జీవిత సౌభాగ్యములను సతము**
**ప్రోచుగావుత తదభీష్టములనొసంగి**

2

**రవ్వ పెట్టదు మాబొట్టె రాగ కాదు**
**ముద్దు ముద్దుగ మాటాడు ముద్దుగుమ్మ**
**ఏలు కొమ్మ చిరంజీవి! ఇంపు పెంపు**
**సొంపు నింపుగ సతతము చూపుచుండి**

3

**అమ్మా! సురేఖ! చెప్పెద**
**సమ్మతిగా నొక్కమాట చల్లగ వినుమా!**
**సమ్మాన్యరీతి కాపుర**
**ముమ్ముద్దుగ దిద్దు కొనుచు పొందుము కీర్తిన్**



4

**ఆదర్శదంపతులరై**
**మోదించుచు పుత్ర పౌత్రముఖ దర్శన స**
**మ్మోదమ్మున వర్ధిల్లుడీ!**
**మాదృశకవిరాజ వాక్సమాదృతియెసగన్**

5

**శతమానం భవతీ తి**
**శ్రుతిహితవాక్యార్థ విపుల శోభన్ మీరల్**
**మతిమన్ముఖ్యుంచే సం**
**స్తుతులన్ గొనుదయ్య నవవధూవరులారా**

ఇతి శ్రీ

**"కవిరత్న" యామిజాల పద్మనాభ స్వామి**

మద్రాసు 20-2-1980

**- యామిజాల జగదీశ్**

---

అవే భారతఖండ వాస్తువిద్యకు మూలరూపాలని కొంతమంది అభిప్రాయం.

## దేవాలయ నిర్మాణం

దేవాలయ నిర్మాణంలో మొట్టమొదటి అంశం ఆలయ నిర్మాణానికి భూమిని ఎన్నుకోవడం ఉంది. పవిత్రములైన దేవాలయాలు సాధారణంగా నదీతీరాల్లోకాని, నీటి బుగ్గలు ఉన్న పర్వతాగ్రాల వామిపుష్కరిణి, ఉత్సవమూర్తుల నుంచే గది ఇత్యాదులు సర్వసాధారణంగా ఉంటాయి. సాధారణంగా శివాలయం పట్టణానికి ఈశాన్య దిశలోను, విష్ణ్వాలయం పశ్చిమదిశలోను, సూర్యదేవాలయం తూర్పు దిక్కులోను, దుర్గ ఆలయాలు ఉత్తరదిశలోను, బ్రహ్మాలయం పట్టణ మధ్యభాగంలోను ఉండాలట.

సామాన్యంగా శివాలయాల్లో లింగమే మూలబేరంగా ఉంటుది. లింగం ఎత్తునుబట్టి శివాలయాలు ఉత్తమోత్తమ, ఉత్తమ, మధ్యమ మున్నగు విధాలుగా వర్గీకరించబడతాయి. గర్భగుడిలో లింగంతోపాటు ఇచ్ఛ, మరియు క్రియా అనే శక్తులు ఉంటాయి. ప్రవేశా ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులు ఉంటారు.

వినాయకుడు, దక్షిణామూర్తి, విష్ణువు లేదా అర్ధనారీశ్వరుడు, లింగోద్భవ, బ్రహ్మ, దుర్గ మరియు చండీశ్వరాలయాలు సాధారణంగా ప్రధాన ఆలయం చుట్టూ ఉంటాయి.

రెండవ ప్రాకరంలో సూర్య, వినాయక, సుబ్రహ్మణ్య, గజలక్ష్మి మరియు భారతదేశం అంతటా ఇదంతా ఒకే లాగ ఉండదు.

శైవాలయాల్లో గర్భగుడికి ముందు నంది విగ్రహం ఉంటుంది

వైష్ణవాలయాల్లో గర్భ గుడికి ముందు బలిపీఠం, ధ్వజస్థంభాలు కలిగిన గరుడ విగ్రహం ఉంటుంది. తక్కిన చిన్నచిన్న దేవుళ్ళ విగ్రహాలు, ఆలయాలు కూడా ఆలయప్రాంగణంలో ఉంటాయి. ప్రవేశ ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులు ఉంటారు.

భక్తులు స్నానం చేయడానికి "తీర్థం" లేదా "పుష్కరిణి" ఆలయ సమీపంలో ఉంటుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, దేవాలయాల చెంత "పుణ్యతీర్థాలు" ఉంటాయి. దైవానికి కాక జలానికి ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలను సాధారంగా "పుణ్యతీర్థా" అంటారు.

ప్రాచీన కాలంనుంచీ ఆంధ్రదేశం శిల్పకళకు, చిత్రకళకు, వాస్తుకళకు, పుణ్యక్షేత్రాలకు, ఇలా మన ఔన్నత్యాన్ని తెలుసుకోవడానికి నేడు మనకు ఉన్న పుణ్యక్షేత్రాలు - దేవస్థానాలు కూడ ఒక సాధనంగా ఉపకరిస్తున్నాయి. శిధిల ప్రాయమయిన దేవాలయాల్లో కూడ నేటికి పుజా పునస్కారాలు జరుగుతునే ఉన్నాయి. భగవంతుడి మీద ఉన్న భక్తి విశ్వాసాలు దీనికి ప్రత్యక్ష కారణాలైతే, నాటి విగ్రహ శిల్పసౌందర్యాన్నీ, దేవాలయ నిర్మాణాన్ని మట్టిపాలు చేసుకోలేక, నాటి ఆంధ్రమహా వైభవాన్ని గుర్తుచేసుకొని వాటిని పునరుద్ధరించాలనే మహదాకాంక్ష పరోక్ష కారణంగా కనిపిస్తుంది.

ఎన్నో దేవాలయాలు పరమత ద్వేషం వల్ల మట్టిపాలయ్యాయి. పోయినవి పోగా ఉన్న వాటినైనా నిలుపుకొని వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా వుంది. అది మనందరి కర్తవ్యం. ●

# ప్రాణాలు అయిదు

ప్రాణ వాయువు- గొంతుకకి శ్వాశ నాళానికి నడుమ ఈ వాయువు ఉంటుంది. ఈ ప్రాణ వాయువు గొంతుక, హృదయము, ఊపిరితిత్తులకు ఆయువు పట్టు. శ్వాశక్రియకి ఆధారమైనది ఈ ప్రాణ వాయువు. ప్రాణవాయువు గమనం ఊర్ధ్వ ముఖం గా ( పైకి) వుంటుంది.

అపాన వాయువు- ఈ వాయువు మనిషి శరీరభాగాలైన పెద్ద ప్రేగులు, చిన్న ప్రేగులు, మూత్ర పిండాలు, మూత్ర వ్యవస్థ ఇత్యాది విసర్జనకి సంబంధించిన శరీర భాగాలకి ఆయువు పట్టు. ఈ అపాన వాయుగమనం ఎల్లప్పుడూ శరీరంలో అధోముఖంగా (క్రిందికి) వుంటుంది.

సమాన వాయువు- ఈ వాయువు ఉదరము,కాలేయము, క్లోమము, ప్లీహము, పెద్ద ప్రేగులు, చిన్న ప్రేగులని నియంత్రిస్తుంది. ఈ వాయువు జీర్ణక్రియకి దోహద పడుతుంది.


ఉదాన వాయువు- ఈ వాయువు గొంతుకకి పైన వదనము, శిరస్సులలో వుండి పంచేంద్రియాలకు, మెదడుకి ఆయువు పట్టుగా పనిచేస్తుంది. ఈ వాయువు మనిషి చేతులు, కాళ్ళకి ఎంతో కీలకము.

వ్యాన వాయువు- ఈ వాయువు మనిషి శరీరమంతటను వ్యాపించి పోషక పదార్ధాలని శరీరమందు సర్వావయవములకు సక్రమముగా అందేలా చేస్తుంది.

పంచప్రాణాలు మనిషి శరీరంలో నాడుల ద్వారా ప్రసరిస్తాయి. మనిషి శరీరంలో 72,000 నాడులు వున్నాయి. వీటిలో ప్రధానమైనవి మూడు- ఇడ, పింగళ, సుషుమ్న నాడులు. ఇడ శరీరమునకు ఎడమ వైపున, పింగళ కుడివైపున, సుషుమ్న నాడి శరీరానికి నడుమ భాగమున వుంటాయి. అయిదుగా విభజింపబడ్డ ప్రాణ వాయువు (ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యాన) మనిషి శరీరమందు సక్రమంగా ప్రసారమవడానికి ఈ మూడు నాడులు ఉపకరిస్తాయి. ఇడ, పింగళ నాడులు మనిషి శరీరంలో ఎడమ, కుడి భాగాలను, సుషుమ్నా నాడి వెన్నుముక లోని క్రింది భాగమైన మూలాధారాన్ని ఊర్ధ్వ ముఖమైన సహస్రారాన్ని అనుసంధిస్తాయి.

ప్రాణ వాయువు ఐదుగా విభజింపబడి మనిషి శరీరం అంతటా వ్యాపిస్తే, ఆ ప్రాణ వాయువుకి చైతన్యం, శక్తి వెన్నుముక లో వున్న ఆరు చక్రాల ద్వారా లభిస్తుందని యోగ కుండలిని ఉపనిషత్ చెబుతుంది. ఈ ఆరు చక్రాలు- మూలాధారము, స్వాదిష్టాన, మణిపుర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞ చక్రం. మూలాధారం పృధివి కి, స్వాధిష్టానం జలానికి, మణిపూర చక్రం అగ్నికి, అనాహత చక్రం వాయువుకి, విశుద్ధి చక్రం ఆకాశానికి, ఆజ్ఞా చక్రం బుద్ధికి చిహ్నాలుగా చెబుతారు. ఈ షట్చక్రాల మీద శిరస్సు పైన సహస్రార చక్రం ఉందని అంటారు. దీనినే బ్రహ్మ రంధ్రం (the door to God) అని కూడా పేర్కొంటారు. ధ్యానం వలన మనిషి సహస్రార చక్రం యొక్క శక్తిని గ్రహించ గలిగితే స్వీయ పరిపూర్ణత (self realization) పొందగలడని యోగ శాస్త్రం చెబుతుంది. ఈ ఆరు చక్రాలు త్రిగుణాలతో పోలుస్తారు. మూలాధారము, స్వాదిష్టాన చక్రం తమో గుణానికి, మణిపుర, అనాహత చక్రాలు రజోగుణానికి, విశుద్ధ, ఆజ్ఞ చక్రాలు సత్వ గుణానికి ప్రతీకలు.

మూలాధార చక్రానికి పైన బ్రహ్మ గ్రంధిని ధ్యానం ద్వారా ఛేదిస్తే స్వాదిష్టాన, మణిపుర చక్రాలకి మార్గం లభిస్తుంది. అదేవిధంగా ధ్యానం వలన మణిపూర చక్రానికి పైన వున్న విష్ణు గ్రంధిని ఛేదిస్తే అనాహత, విశుద్ధ చక్రాలకు మార్గం లభిస్తుంది. అనంతరం నిరంతర ధ్యానము వలన విశుద్ధి చక్రం పైన వున్న




రుద్ర గ్రంధి ఛేదింపబడి ఆజ్ఞా, సహస్రార చక్రాలకు మార్గం సుగమం అవుతుంది.

లలితా సహస్రనామస్తోత్రంలో


**"మూలాధారైక నిలయా బ్రహ్మగ్రంధి విభేదిని**
**మణిపూరాంత రుదితా విష్ణు గ్రంధి విభేదిని**
**ఆజ్ఞాచాక్రాంత రాళస్థా రుద్ర గ్రంధి విభేదిని**
**సహస్రారాంబుజా రూడా సుధాసారాభి వర్షిని**
**తటిల్లతా సమరుచ్యై షట్చక్రో పరిసంస్థితా**
**మహాశక్త్యై కుండలిన్యై బిసతంతు తనీయస్యై"** అనే నామాలు ఉన్నాయి.

అమ్మవారు పైన పేర్కొన్న మూడు గ్రంధులు- బ్రహ్మ గ్రంధి, విష్ణు గ్రంధి, రుద్ర గ్రంధి లను ఛేదించే శక్తిని భక్తుడికి ప్రసాదిస్తుంది. మెరుపు తీగ లాంటి అమ్మవారు ఈ షట్చక్రాలకు పైన కొలువై వుంటుంది. మహాశక్తి అయిన అమ్మవారు కుండలిని రూపాన్ని ధరించి కోమలమైన కమలము నుండి వచ్చే మృదువైన దారమును పోలి వుంటుంది అని లలితా సహస్ర నామస్తోత్రంలో వర్ణిస్తారు. వెన్నుముక క్రింది భాగంలో మూలాధార చక్రంలో నిద్రాణమైవున్న శక్తి నిదురించే సర్పంలా వుండటం వలన దీనిని కుండలిని అంటారు. ధ్యానం వలన ఆ నిద్రాణమై వున్న శక్తి, చలనాన్ని చైతన్యాన్ని పొంది ఊర్ధ్వ ముఖంగా పయనించి సహస్రార చక్రాన్ని తాకి తద్వారా సృష్టిలో వున్న చైతన్యంలో లీన మవుతుంది. సృష్టి లోని చైతన్యం తో మనిషిని అనుసంధానం చేసే సహస్రార చక్రానికి అందువలన బ్రహ్మ రంధ్రం అని పిలుస్తారు. చైతన్య స్వరూపిణి అయిన అమ్మవారి కృప కలిగితే ఐశ్వర్యం తో పాటు మోక్షం కూడా లభిస్తుంది.

**సర్వే జనః సుఖినో భవంతు**

**- బీయస్వీ పార్ధసారధి**





తెలుగు, తమిళ, కన్నడ, హిందీ చిత్రాలు తీసిన

# యరగుడిపాటి (వై.వి.రావు) వరదారావు

గొప్పగా అన్నీ కరతలామలకంగా చేయడమే తప్ప తన గొప్పదనాన్ని పెద్దగా ప్రచారం చేసుకొనే ఆడంబరతనం ఆరోజుల్లో లేనేలేదు. వృత్తిపరంగా తన పనుల్ని తాను చేసుకునిపోవడమే పరిపాటి. తనవారూ పెరవారూ, తన భాషా పరభాషా అనే బేధం అసలుండేది కాదు.

నెల్లూరులో చదువుతూన్నప్పుడు నాటకానుభావం యరగుడిపాటి వరదారావును సినిమా రంగానికి చేర్పించి. అప్పుడు మద్రాసులో చలనచిత్ర నిర్మాణం లేదు. 1920 ప్రాంతాల్లో వేషాలు వేశారు. ఆయనది సిరిగల కుటుంబం కాబట్టి, ఆ అనుభవంతో చలనచిత్ర నిర్మాణమునకు నడుము కట్టారు. తానే హీరో, నిర్మాత, దర్శకునిగా చలనచిత్ర నిర్మాణం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో సాంఘిక, పౌరాణిక, జానపద చిత్రాలను సహితమూ నిర్మించారు. ఇందులో సమస్యాత్మక చిత్రాలు – కొన్ని.

ఆయనది సిరిగల కుటుంబం. నెల్లూరులోని పెన్నానది ఒడ్డున నిర్మించిన రంగనాథ దేవాలయం గోపురాలను వారి కుటుంబమే నిర్మించిందంటారు. ఆ కారణంగా దైవభక్తి కూడా అహిరంగా ఉండేది. మూడ భక్తినీ, మూఢాచారాన్నీ చెండాడే సంస్కృతి కూడా ఆయనకే ఉండేది. 1939వ సం॥లో ఆయన నటించి, దర్శకత్వం వహిస్తూ నిర్మించిన 'మళ్లీ పెళ్లి' చిత్రం పెద్ద వివాదం సృష్టించింది. 'తాసీల్దార్' మంచి హిట్టయింది. జయాపజయాలకు ఆయన వెరవలేదు.

ఇలా చలనచిత్రాల్లో వేషాలు వేస్తున్న వై.వి. రావు మద్రాసులోని నిర్మాత దర్శకుడైన ఆర్. ప్రకాష్ దృష్టిలో పడ్డారు. ఆయనకు సహాయకుడుగానూ, ముఖ్యపాత్రధారిగానూ పనిచేశారు. టాకీ సినిమాలకు పూర్వం వచ్చిన మూకీ సినిమాల్లో కూడా నటించారు. 1930 సం॥ములో 'సారంగధర' చిత్రాన్ని తానే దర్శకుడై నిర్మించారు. అనంతరం పాండవ నిర్యాణ, పాండవ అజ్ఞాతవాసం, హరిమాయ చిత్రాలను నిర్మించారు. తనకంటూ ఓ స్థానం ఏర్పరచుకున్నారు. తర్వాత ఆయన మకామును బెంగుళూరుకు మార్చారు. బెంగుళూరులో సౌత్ ఇండియా మూవీస్‌ను ప్రారంభించి తొలిసారిగా కన్నడంలో 'సతీసులోచన' చిత్రాన్ని నిర్మించారు. 1934వ సం॥లో ఆ చిత్రం కర్ణాటకలో విడుదలై విజయ విహారం చేసింది. 1937 సం॥ములో ఆయన నిర్మించిన 'చింతామణి' చిత్రాన్ని త్యాగరాజ భాగవతార్ బిళ్వమంగళునిగా నిర్మించారు. అది సూపర్ హిట్టయింది. తరువాత 'స్వర్ణలత' చిత్రాన్ని నిర్మించారు. 1939 సం॥ములో వితంతు వివాహాలు కథా ఇతివృత్తంగా, అప్పటి బ్రాహ్మణుల చాదస్త భావాలను గర్హిస్తూ 'మళ్లీ పెళ్లి' చిత్రాన్ని నిర్మించారు. అందులో ఆయన నాయక పాత్రధారి కాంచమాల నాయిక. బ్రాహ్మణుల సాంప్రదాయ, సదాచారాలను నిశితంగా విమర్శించడంలో ఆయన బ్రాహ్మణుల్నుంచీ విపరీతంగా తిరుగుబాట్లు నెదుర్కోవలసి వచ్చింది.

మూఢ విశ్వాసాలను ఎదుర్కొనే ధైర్యం తనకు ఉందంటూ నిబ్బరంగా నిలిచారు. ఆ చిత్రానికి ఓగిరాల రామచంద్రరావు సంగీత దర్శకత్వం, ఆయనే వై.వి. రావుకు పాటల్లో గొంతు నెరువివ్వడం జరిగింది. అటు తరువాత 'విశ్వమోహిని' చిత్రం నిర్మించారు. తరువాత కృష్ణ పాత్ర కూడా ధరించారు. 'సత్యభామ' చిత్రం తీశారు. పుష్పవల్లి, భానుమతి, కమలా కోట్నీసే వంటి అందాల లీలాభామలంతా ఆయన చిత్రాల్లో నటించినవారే. 1945లో 'శ్రీవళ్లి' చిత్రాన్ని తీస్తూ రుక్మిణి (ఈనాటి లక్ష్మి తల్లి)ని పరిచయం చేశారు. అటు తరువాత ప్రేమ ప్రేమికుల కథాగమనంగల 'లవంగి' చిత్రాన్ని నిర్మించడం ఈ చిత్ర సన్నివేశాల్లోలా రావూ – రుక్మిణిలు ప్రేమించుకున్న పెళ్లాడడం వంటివి నిజ జీవితంలోనూ జరిగిపోయాయి. ఓ మంచి అందగాడు, ఓ మంచి అందాలరాశిని పెళ్ళాడాడంటూ అందరూ అన్నారు. హిందీలో, తమిళంలో, 'రామదాసు' చిత్రాన్ని తీశారు. తాను తానీషా, రుక్మిణి తానీషా భార్య, ఆర్థికంగా ఆ చిత్రం గిట్టుబాటు కాలేదు. తమిళంలో ఆయన నిర్మించి దర్శకత్వం వహించిన చిత్రం 'సావిత్రి' హిందీ మరాఠీ చిత్రాల తార శాంతా ఆప్టేను సావిత్రిగా నటింపజేశారు. ఆమె కూడా తమిళం నేర్చుకుని తన మాటల్ని తానే చెప్పింది.

సావిత్రి చిత్రంలోనే సుప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వన్మణి ఎం.ఎస్. సుబ్బులక్ష్మిని రావుగారు నారద పాత్రలో తెరకు పరిచయం చేశారు. ఆమె గానమాధురి శ్రోతలను పువ్వుటూయ్యాల్లో సంగీత సౌరభంలో ఊయలలూగించింది. ఇలాటి ఎందరో ప్రతిభా సుందరిలు, సుందరులను, సాంకేతిక విజ్ఞులను పరిచయం చేసిన కీర్తి వై.వి. రావు ఒక్కరికే దక్కుతుంది. పౌరాణికాల్నుంచి సాంఘికాల వరకు, మూకీల నుంచి టాకీల వరకు, సమస్యలనుంచీ సంస్కృతీ వైభవం వరకూ చిత్రాలను నిర్మించిన వై.వి. రావుదాక ప్రత్యేకయుగం. కానీ ఆయన్ను గురించీ ఎక్కువగా చెప్పుకోకపోవడం చిత్రయుగ లక్షణం! ●

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653


*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# తెలుగు ప్రముఖుల పోస్టల్ స్టాంపులు

*ఆధునిక చరిత్రకు స్టాంపులు ముఖ్య ఆధారాలు. ఇవి చరిత్రను తెలియజేస్తాయి.*

*కృష్ణాతీరం అనాది నుండి పరిణతి చెందిన నాగరికతకు నిలయం. ఈ కృష్ణాతీరంలోని వివిధ రంగాల ప్రముఖులకు చెందిన స్టాంపులను భారత ప్రభుత్వ తపాలాశాఖ ఆయా సందర్భాలలో విడుదల చేసింది. ఆయా స్టాంపులు వారి వారి ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. ఫిలాటెలిస్టులు (స్టాంపులు సేకరించేవారు) ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. కాబట్టి కృష్ణాతీర ప్రముఖులను స్మరించుకుందాం.*

## డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య




'భారత జాతీయ కాంగ్రెస్ చరిత్ర'ను గ్రంథస్థం చేసిన పట్టాభి మచిలీపట్నం కేంద్రంగా పనిచేశారు. ఆంధ్రా బ్యాంకు స్థాపకులు, ఆంధ్రా లైఫ్ ఇన్సూరెన్స్ వ్యవస్థాపకులు, ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీలను స్థాపించారు. "భారత జాతీయ కాంగ్రెస్" తరపున గాంధీజీ నడిపిన ఉద్యమాలు అన్నింటిలోను ప్రముఖ పాత్ర వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా పనిచేస్తూనే – సమాంతరంగా ఆంధ్రుల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన వీరి జ్ఞాపకార్థము 17-12-1997వ తేదీన రూ. 2-00ల విలువతో స్టాంపును విడుదల చేసింది భారత ప్రభుత్వ తపాలా శాఖ.

## శ్రీ పింగళి వెంకయ్య




ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, ఖనిజ శాస్త్రవేత్త, జాతీయ పతాక నిర్మాత అయిన పింగళి కృష్ణాజిల్లాలో జన్మించారు. 1921లో విజయవాడలో కాంగ్రెస్ మహాసభలు జరిగినప్పుడు గాంధీజీ ఆయనని జాతీయ పతాకం తయారు చేయమని కోరారు. తెలుపురంగు మీద వెలసిన 'రాట్నం' చిత్రం స్థానాన్ని 'అశోక ధర్మచక్రం' ఆక్రమించింది. ఈనాటి జాతీయ జెండా ఇదే! పింగళి వారి జ్ఞాపకార్థము 12-08-2009వ తేదీన రూ. 5-00ల విలువతో విడుదల చేశారు.

## ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు




స్వాతంత్ర్యోద్యమ నాయకులు, గుండుకెదురుగా గుండె నిలిపిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 1953 అక్టోబర్ 1వ తేదీన ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి నియమితులయ్యారు. స్వాతంత్ర్య సమరయోధులుగా, ముఖ్యమంత్రి పదవిని త్యజించిన నిబద్ధత గలిగిన నాయకునిగా పేరు పొందారు. ప్రభుత్వం నిధులను మంజూరు చేయకపోయినప్పటికీ విజయవాడలో కృష్ణానది ఒడ్డున బ్యారేజిని త్వరిత గతిని నిర్మింపజేశారు. అది "ప్రకాశం బ్యారేజి" పేరుతో వెలుగొందుతోంది. వీరి జ్ఞాపకార్థం 16-10-72వ తేదీన 20 పైసలు విలువగల స్టాంపు విడుదలయింది. ఆంధ్ర కేసరి శతజయంతి సందర్భంగా వెలువడింది ఈ స్టాంపు.




## హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి

బహుభాషా కోవిదుడు, సంఘ సంస్కర్త హైదరా బాద్ నైజాం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణా రావు కృష్ణాతీరంలోని మహబూబ్ నగర్‌లో జన్మించారు. హైదరాబాద్ రాష్ట్రంగా ఆవిర్భవించిన నైజాం సంస్థానానికి సుపరిపాలనను అందించారు. విశాలాంధ్ర ఆవిర్భావం కోసం ముఖ్యమంత్రి పదవిని త్యజించిన సమైక్యవాది. ఆయన జ్ఞాపకార్థం 13-3-2000వ తేదీన రూ. 3-00ల స్టాంపు విడుదలయింది.

## శ్రీ దామోదరం సంజీవయ్య




కృష్ణాతీరం కర్నూలు జిల్లాలో జన్మించిన శ్రీ దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్‌కు 2వ ముఖ్యమంత్రి. గాంధేయవాదిగా స్వాతంత్ర్యోద్యమంలో పాలుపంచుకున్నాడు. భారతదేశ తొలి ముగ్గురు ప్రధానమంత్రుల మంత్రి మండలిలో క్యాబినెట్ మంత్రిగా విధులను నిర్వర్తించడం విశేషం. వీరి స్మారకార్థము 14-2-2008వ తేదీన రూ. 5-00 విలువతో విడుదలయిన స్టాంపు "సంజీవయ్య గారి చిత్రం నేపథ్యంలో తిరుమల ఆనంద నిలయం, చార్మినార్, అసెంబ్లీ భవనం, కూచిపూడి నృత్యకళాకారిణి, నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ చిత్రాలను ముద్రించడం ద్వారా ఆ స్టాంపుకు ప్రత్యేకత సమకూరింది.

## శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి




ఆంధ్రప్రదేశ్‌కు తొలి కోస్తా ప్రాంత ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి గుంటూరు జిల్లాలో జన్మించారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. వీరి రాజకీయ ప్రస్థానం విచిత్రమైన మలుపులతో కూడుకొంది. 1969 ఎన్నికలలో రాష్ట్రపతి ఎన్నికలలో శ్రీమతి ఇందిరాగాంధికి మద్దతునిచ్చారు. 1978లో ఇందిరా కాంగ్రెస్‌కు వ్యతి రేకంగా – ఆనాటి అధికార కాంగ్రెస్ (రెడ్డి కాంగ్రెస్) అధ్యక్షులుగా పనిచేశారు. మళ్ళీ 1980 ఎన్నికల తరువాత శ్రీమతి ఇందిరాగాంధి మద్దతుదారుగా నిలిచాడు. పోచంపాడు, నాగార్జున సాగర్ ప్రాజక్టులు త్వరితగతిని పూర్తిచేయించి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పయనింపజేశారు. వీరి జ్ఞాపకార్థం 26 డిసెంబర్, 2011వ తేదీన రూ. 5-00 విలువతో స్టాంపు విడుదలయింది.

## శ్రీ నందమూరి తారక రామారావు




తెలుగువారి వెండితెర వేల్పు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, ఆంధ్రప్రదేశ్‌కు తొలి కాంగ్రేసేతర ముఖ్యమంత్రి, జాతీయ ప్రతిపక్ష నాయకుల సమావేశాన్ని ఇంద్రకీలాద్రి వద్ద నిర్వహించిన గొప్ప ప్రతిపక్ష నాయకుడు శ్రీ ఎన్.టి. రామారావు. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకుని వచ్చిన వీరి జ్ఞాపకార్థం 31-5-2000వ తేదీన రూ. 3-00ల విలువగల స్టాంపును విడుదల చేశారు. తెలుగు సంస్కృతికి ప్రతీకగా భుజాన ఉత్తరీయంతో ఉన్న ఎన్.టి.ఆర్. చిత్రంతో పాటు సినిమా రీల్స్ మధ్యలో తెలుగు సినీమతల్లి వెనుక భాగాన ఎత్తయిన పర్వత శ్రేణులు కన్పిస్తాయి.

## శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి




హేతువాది, సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమర యోధుడు, కవిరాజు రామస్వామి చౌదరి. 'కురుక్షేత్ర

సంగ్రామం' వంటి గ్రంథాన్ని రచించారు. 'వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడొ తెల్పుడీ!" గేయంతో ప్రజలను ఉగ్రూతలూగించి దేశభక్తిని పెంపొందింపజేశారు. ది. 25-4-1987వ తేదీన 'India's Struggle for Freedom - 5th Series' లో భాగంగా వీరి స్టాంపును 60 పైసల విలువతో విడుదల చేశారు.

### శ్రీ త్రిపురనేని గోపీచంద్




కవిరాజు కుమారుడు గోపీచంద్ 'ఎందుకు?' అని ప్రశ్నించే తత్వాన్ని తండ్రి దగ్గర నుండి అలవరచు కున్నారు. అసమర్థుని జీవయాత్ర, పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా, పోస్టు చేయని ఉత్తరాలు వంటి గ్రంథాలను రాశారు. చలనచిత్ర సీమలో వివిధ శాఖ లలో పనిచేశారు. వీరి జ్ఞాపకార్థము 8 సెప్టెంబర్, 2011వ తేదీన రూ. 5 విలువగల స్టాంపు విడుద లయింది.

భారతదేశములో జవహర్‌లాల్ నెహ్రూ కుటుంబానికి మాత్రమే కుటుంబ సభ్యులకు అందరికీ స్టాంపులను ముద్రించడం జరిగింది. ఆ కోణంలో పరిశీలిస్తే తెలుగువారిలో తండ్రీ కొడుకులకు ఇద్దరికీ స్టాంపులు విడుదలయింది. "కవిరాజు త్రిపురనేని రామస్వామి, వారి కుమారుడు గోపీచంద్‌లకే!"

### శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు





విశ్వదాత, దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగే శ్వరరావు కృష్ణాజిల్లాలో జన్మించారు. స్వాతంత్ర్యో ద్యమ నాయకుడు. 1908లో స్థాపించిన ఆంధ్ర పత్రిక ద్వారా జాతీయోద్యమానికి విస్తృత ప్రచారం గావించారు. 'అమృతాంజనం' ప్రపంచ ప్రఖ్యాతి పొందిన నొప్పి నివారణ మందు. దీని అమ్మకాల ద్వారా లభించిన లాభాలను పత్రికా నిర్వహణ కోసం, పేదవారి కోసం ఖర్చుపెట్టడం విశేషం. వీరి జ్ఞాపకార్థము 1-5-1969వ తేదీన 20 పైసల విలువగల స్టాంపు విడుదలయింది.

### శ్రీ కోటంరాజు రామారావు




నాటి గుంటూరు జిల్లా చీరాలలో జన్మించిన శ్రీ కోటంరాజు రామారావు 25 జాతీయ, అంతర్జాతీయ పత్రికలకు పనిచేసిన కులం వీరుడు. పంచవర్ష ప్రణాళిక ప్రచారక సలహాదారుగా పనిచేశారు. ది టైమ్స్ ఆఫ్ ఇండియా, సింథ్ అబ్జర్వర్, హిందూస్థాన్ టైమ్స్, నేషనల్ హెరాల్డ్ వంటి పత్రికలలో పలు బాధ్యతలను నిర్వహిం చారు. గాంధీ నెహ్రూలు, డా॥ బాబూ రాజేంద్రప్రసాద్, నేతాజీ వంటి విభిన్న వ్యక్తుల మన్ననలను పొందిన విశిష్ట వ్యక్తి. వీరి స్మారకార్థము 9-11-1987వ తేదీన రూ. 2-00 విలువగల స్టాంపు విడుదలయింది.

### ఆచార్య ఎన్.జి. రంగా




గుంటూరు జిల్లా, బాపట్లలో జన్మించిన ఎన్.జి. రంగా రైతు బాంధవుడిగా, జస్టిస్ పార్టీ నాయకుడిగా పేరు పొందాడు. స్వాతంత్ర్యోద్యమ నాయకుడిగా, ప్రతిభ కలిగిన పార్లమెంటు సభ్యునిగా పేరు పొందారు. భారతీయ వ్యవసాయ రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా వ్యవసాయ విశ్వవిద్యాలయమునకు ఆయన పేరు పెట్టారు. 'The Father of Indian Peasant Movement'గా పేరు పొందిన ఆచార్య ఎన్.జి. రంగా గారి జ్ఞాపకార్థము 27-01-2001వ తేదీన రూ. 3-00ల స్టాంపు విడుదలయింది.

### శ్రీ గూడూరు వేంకటచలం




కృష్ణా జిల్లాకు చెందిన గూడూరు వేంకటచలం ప్రముఖ వ్యవసాయవేత్త. కొత్త కొత్త వరి వంగడాలను సృష్టించాడు. The Pioneer of Gree Revolution గా పేరుపొందారు. ది. 30-11-2009వ తేదీన Food Safety and Quality Year సందర్భంగా స్పెషల్ కవర్ విడుదలయింది. ఆ తరువాత 10-5-2010వ తేదీన వెంకటచలంగారి స్టాంపును విడుదల చేయడం జరిగింది. రూ. 5-00ల విలువ గల ఈ స్టాంపు మీద వేంకటచలం చిత్రంతో పాటు వరికంకులు దర్శనమిస్తాయి.

### శ్రీగోపరాజు రామచంద్రరావు




ప్రముఖ హేతువాది నాస్తికోద్యమ ప్రచార కులు శ్రీగోపరాజు రామచంద్రరావు తొలి రోజుల్లో కృష్ణాజిల్లా ముదునూరులో నాస్తిక కేంద్రాన్ని నెలకొల్పారు. సంఘసంస్కర్తగా, స్వాంతంత్ర్య సమరయోధులుగా కూడా ఉద్యమించారు. తమ కుటుంబ మంతటిని అనుచరవర్గంగా మార్చారు. వీరీ స్మారక తపాలా బిళ్ళను 16-9-2002వ తేదీన సంఘ సంస్కర్తల సీరిస్‌లో విడుదల చేశారు. ఈ చిత్రంలో గోరా చిత్రాలతోపాటు మహిళ, నాగలి పట్టిన రైతు, పూరిల్లు మొదలగునవి కన్పిస్తాయి.

### శ్రీఘంటసాల వెంకటేశ్వరరావు




అమరగాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు సంగీత దర్శకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు కూడా. కృష్ణా జిల్లాలో జన్మించిన వీరు విజయనగరం కళాశాలలో సంగీతాన్ని అభ్యసించారు. పుష్పవిలాపం, బంగారి మామ పాటలు, భగవద్గీతలను ఆలపించి పేరు పొందారు. తెలుగు సినీ చరిత్ర స్వర్ణయుగం లోను, మలియుగంలోను వీరి స్థానం అద్వితీయం. వీరి జ్ఞాపకార్థం 11-2-2003వ తేదీన విడుదలయిన తపాలా బిళ్ళలో ఘంటసాల చిత్రం ముద్రింపబడింది. ఈ స్టాంపు విడుదల కార్యక్రమములో వీరి కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు. అంతేకాదు ఘంటసాలగారి సమకాలిక గాయనీగాయకులందరినీ ఆత్మీయంగా సత్కరించడం ఒక చారిత్రక విశేషం. అంతరించబోతున్న మానవ సంబంధాలకు తార్కాణం.

### ఎస్వీ రంగారావు




స్ఫురద్రూపం ఎస్.వి. రంగారావు 'వరూధిని' చిత్రంతో సినిమారంగ ప్రవేశం చేశారు. జానపద చిత్రాలలో మాయావిగా, పౌరాణిక చిత్రాలలో రాక్షసునిగా, సాంఘిక చిత్రాలలో ఉదాత్త స్వభావిగా, ప్రతి నాయకుడిగా, పిన్నవయసులో తండ్రి పాత్రలలో రాణించారు. 'నర్తనశాల' చిత్రంలో పోషించిన 'కీచకుని' పాత్ర నటనకు జకర్తా ఫిలిమ్ ఫెస్టివల్‌లో పురస్కారం అందుకున్న తొలి భారతీయునిగా ప్రఖ్యాతి పొందిన వీరికి ప్రత్యామ్నాయం లేదు. వీరి స్మారక తపాలా బిళ్ళ 'భారతీయ సినిమాకు వందేళ్లు' సందర్భంగా 3-5-2013వ తేదీన రూ.5 విలువతో విడుదల చేశారు.

### శ్రీమతి పి. భానుమతి రామకృష్ణ




ప్రముఖ నటి, గాయని, నిర్మాత, దర్శకురాలు, రచయిత్రి అయిన బహు ముఖ ప్రజ్ఞాశాలి శ్రీమతి పాలువాయి భానుమతీ రామకృష్ణ 'స్వర్గసీమ' చిత్రం తోనే తెలుగు ప్రేక్షకుల మనస్సును దోచుకున్నారు. మల్లీశ్వరిలో నవరసాల అభినయాన్ని, విప్రనారాయణలో దేవ దేవిగా ఆమెకు ఆమే సాటి అన్నట్లు నటించారు. గుణచిత్ర నటిగా అమ్మ, అత్త, అమ్మమ్మ, నాన్నమ్మ వంటి పాత్రలు పోషించినా ప్రతి చిత్రంలో ఆమె పాత్రకు ప్రాముఖ్యత ఉండేది. వీరి స్మారక తపాలా బిళ్ళ 5-5-2013వ తేదీన 'భారతీయ సినిమాకు వందేళ్ళు' సీరీస్‌లో విడుదలైంది.

### శ్రీమతి సావిత్రి




గుంటూరు జిల్లాలో జన్మించిన సావిత్రి చిన్న వయస్సులోనే సినిమా పట్ల మక్కువని పెంచుకుంది. సంసారం సినిమాలో చిన్న పాత్రని పోషించిన ఈమె తరువాత చలనచిత్రరంగంలో మకుటం లేని మహారాణి అయింది. మాయాబజార్, దీపావళి, కర్ణ వంటి పౌరాణిక చిత్రాల లోనూ, చంద్రహారం వంటి జానపద చిత్రాలలో కథానాయికగా నటించింది. గుణచిత్రనటిగాను జీవించింది. నిర్మాతగా, దర్శకురాలిగా పలు చిత్రాలను నిర్మించింది. కేంద్ర ప్రభుత్వ పరంగా పద్మపురస్కారం అందుకోలేదు. కాని 'ది లెజెండ్రీ హీరోయిన్స్ ఆఫ్ ఇండియన్ సినిమా' సిరీస్‌లో విడుదలయిన ఆరుగురు కథానాయికల స్టాంపులలో ఈమెకు ప్రాముఖ్యతనివ్వడం ద్వారా ఆమెకు జాతీయ స్థాయి గౌరవాన్ని కల్పించింది భారత తపాలాశాఖ.

ఈ విధంగా వివిధ రంగాల్లో పేరు పొందిన కృష్ణాతీర ప్రముఖుల స్టాంపుల్లో స్థానం కల్పించిన భారత తపాలా శాఖను అభినందించాలి. అయితే ఇంకా చాలామంది ప్రముఖులకు ఈ గౌరవం కల్పించవలసి వుంది.

ప్రముఖపాత్రికేయులు శ్రీ నార్లవెంకటేశ్వర్లు, ప్రముఖ ఇంజనీర్ కే.యల్. రావు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతలు శ్రీవిశ్వనాథ సత్యనారాయణ; శ్రీరావూరి భరద్వాజ, మహాకవి క్షేత్రయ్య, రఘుపతి వెంకయ్య, గూడవల్లి రామబ్రహ్మం, అక్కినేని నాగేశ్వరరావువంటి ఎందరో మహానుభావులు ఉన్నారు. వారి తపాల బిళ్ళలు తెలుగువారికి అందించి గౌరవించాల్సిన అవసరం ఎంతయినా వుంది.

– పుట్టి నాగలక్ష్మి (తెలుగు విద్యార్థి సౌజన్యంతో)

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

# శతమానం భవతి



**25** సంవత్సరాలు, మన 'ప్రముఖాంధ్ర'కి. పాతికేళ్ల క్రితం పూచిన సంకల్ప కుసుమం ఇది. తెలుగు జ్యోతి ఇది. ఇంకా వెలుగులీనుతూనే వుంది. వెలుగుతూనే వుంటుంది.

శ్రీగోటేటి రామారావుగారి మానస పుత్రిక యీ 'ప్రముఖాంధ్ర' పత్రిక. ఒంటిచేత్తో ఆల్‌మోస్టు చివరి క్షణం వరకూ పత్రికను నడుపుతూనే వున్నారు. అలసినా సొలసినా చివరి క్షణం వరకూ 'బిడ్డ' ఆలనాపాలనా మరువ లేదు.

పత్రికను 'ఉచితంగా' పంపటమేగాని ఏనాడూ 'ఖరీదు' కట్టలేదు. బిడ్డకి ఏ లోపమూ చెయ్యలేదు. ఖరీదైన ముఖచిత్రమే, ఖరీదైన కాయితమే.

ఎదిగే బిడ్డకి కానుకగా బహుమతులు ఇచ్చినవారిని రామారావు గారు ఏనాడూ విస్మరించలేదు. వారి దాతృత్వాన్ని వేనోళ్ళ పొగిడేవారు.

చూసీ చూడనట్టు పోయేవాళ్ళని కూడా ఏనాడూ విస్మరించలేదు. పత్రికని తాంబూలంగా ఇచ్చేవారు.

అందుకే 'ప్రముఖాంధ్ర' దినదిన ప్రవర్థమానమయింది. కాలంతోపాటు కొత్త సొబగుల్ని సమకూర్చుకుంది. చి॥గోటేటి వెంకటేశ్వరరావుగారిది చి॥సౌ॥ ప్రముఖాంధ్రదీ అన్నాచెల్లెళ్ళ అనుబంధం.

ప్రతినెలా శ్రీగోటేటి శ్రీరామారావుగారి ఆశీస్సులనూ, ఆయన అవ్యాజ ప్రేమనూ పాఠకులకు గుర్తు చేసి అజాత శత్రువైన తండ్రిగారికి నెల నెలా నివాళులర్పిస్తూనే వుంది యీ ప్రముఖాంధ్ర.

మొదలుపెట్టిన నాటి నించీ నేటివరకూ లెక్కవేస్తే–

1. పాతికేళ్ళ 'కాలగతి' శ్రీరామారావుగారి 'సంపాదకీయం'లో కనిపిస్తుంది. ఎందరు రాజకీయ నాయకులు, ఎందు లబ్దప్రతిష్టులు ఎందరు మహోన్నతులు ఆయన కలం ద్వారా లోకానికి తెలియజేయబడ్డారో!
2. ఆధ్యాత్మిక గురువుల ఆత్మీయ సంభాషణలూ మంగళా శాసనాలూ!
3. మహాదాతల వ్యక్తిత్వాలూ వారి కుటుంబ పరిచయాలు
4. కవుల, గాయకుల, నటీనటుల జీవన ప్రస్థానాలూ, జీవిత విశేషాలూ
5. క్రీడాకారుల విజయాలూ, ప్రశంసలూ
6. చెన్నైలోనే గాక యావత్ ప్రపంచంలో జరిగే తెలుగువారి సమావేశాలు, తెలుగు జాతి వెలుగులూ
7. సభలు… వక్తలు… సాహితీవేత్తలు మొదలైన విశిష్ట ఆత్మీయ సమావేశాలు, చెణుకులు
8. వేద, ఇతిహాస, పురాణ వైభవాలూ, సారాలూ
9. జనాన్ని మంచి మార్గంలో మళ్ళించే హితోక్తులూ, ప్రవచనాలూ…

ఎన్నని విన్నవించేదీ!

ప్రియాతి ప్రియమైన ప్రముఖాంధ్రా–

నీ తండ్రి, నీ అన్నదమ్ములూ అజాత శత్రువులమ్మా పాతికేళ్ళు వారి నీడలో పచ్చగా ఎదిగావు ఇలానే నిండునూరేళ్లూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో అఖిలాంధ్ర జన హృదయాలలో నీవు చల్లగా ఆనందంగా నిలిచిపోవాలని ఆశీస్తూ, ఆశీర్వదిస్తూ

నిన్నీ లోకానికి తెచ్చిన మా గోటేటి శ్రీరామారావుగారికి ప్రణమిల్లుతూ అంజలిఘటిస్తూ, కోటానుకోట్ల తారల్లో నీవు ధృవతారవై వెలుగు పంచాలనీ, మన తెలుగు భాషకు పట్టం కట్టాలనీ నిన్నుకోరుకుంటూ

నీ అభిమాని
**భువనచంద్ర**

# తెలుగు వైభవము

**జనని సంస్కృతంబు సకల భాషలకును**
**దేశభాషలందు తెలుగులెస్స**
**జగతి తల్లి కంటె సౌభాగ్య సంపద**
**మెచ్చుటాడు బిడ్డ మేలు గాదె?**

'దేశభాషలందు తెలుగులెస్స' అని ఇటు ప్రాచ్యులచేత, 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పాశ్చాత్యులచేత సమాదరింపబడిన 'తెలుగుభాష' ప్రపంచ భాషలోని ఉన్నత భాషల సరసన చేర్చదగినది.

భారతదేశంలో హిందీ మాట్లాడేవారి తరువాత తెలుగు మాట్లాడే ప్రజల సంఖ్యే ఎక్కువగా వుంది. అంటే భారతదేశంలోని భాషల్లో రెండవస్థానాన్ని కలిగివుందని చెప్పవచ్చు.

మానవజాతి తన మనోభావాలను, ఆలోచనలను అవగాహనలను ఎదుటివారికి వ్యక్తపరచుకోటానికి భాష వాహికగా ఏర్పడింది. ప్రతిజాతికి తమదంటూ ఒక భాష ఉంటుంది. ఇది బాహ్యాకారంలో భిన్నంగా ఇవ్వేళ ఒక్కటే అయి ఉంటుంది. మానవుడు తన జీవనోపాధి కోసం పలుదేశాలు, ఖండాంతరాలు తిరుగుతూ తనకు అనువైన చోట స్థిరపడిపోతూ ఉంటాడు. ఇలా స్థిరపడిన మానవజాతి సమూహము ఒక సమాజంగా ఏర్పడుతుంది. ప్రపంచములోని పలు ప్రదేశాలలో ఏర్పడిన ఈ సమాజాలు కొంతకాలానికి ప్రత్యేక దేశాలుగా ఏర్పడినప్పుడు, ఆ ప్రజల మధ్య రాకపోకలు, ఆదానప్రదానాలు స్తంభించినప్పుడు వారు మాట్లాడే భాష మరో ప్రదేశం వారికి అర్థం కానంతగా మార్పు చెంది, అదీ ఒక ప్రత్యేక భాషగా రూపొందుతుంది.

భారతదేశంలో ప్రధానంగా రెండు భాషా కుటుంబాలు కనిపిస్తాయి. ఒకటి ఆర్యభాషా కుటుంబం, రెండు ద్రావిడ భాషా కుటుంబము. తెలుగు భాష ఏ కుటుంబానికి సంబంధించినదనే రెండు వాదాలున్నాయి. కాని, ఇటీవల కాలంలోని పరిశోధనల వల్ల తెలుగు భాష ద్రావిడ భాషా కుటుంబానికే చెందినదనే అభిప్రాయమే బలపడింది.

ప్రతిభాషకు తనదంటూ ఒక ప్రత్యేకత ఉంటుంది. అదే విధంగా మన తెలుగు భాష ఒక విలక్షణమై, విశిష్టమైన ఒరవడి కలిగి వుంది. అయితే తెలుగు భాషకు ఆంధ్ర తెలుగు, తెనుగు అనే పర్యాయపదాలు కూడా వాడుకలో ఉన్నాయి. ఆంధ్ర, తెలుగు, తెనుగు అన్నవి నేడు జాతిపరంగా భాషాపరంగా వాడబడుతున్నాయి.

క్రీ.శ. 10వ శతాబ్దానికి పూర్వం తెలుగు అనే మాట వాఙ్మయంలోగాని, శాసననాలలోగాని ఎక్కడా కనిపించడం లేదు. బౌద్ధ, పాళీ వాఙ్మయాలలో 'ఆంధ్ర' అనే పదం కనిపిస్తుందనీ, ఇదే క్రమంగా 'ఆంధ్ర'గా మారి ఉండవచ్చునని పరిశోధక పండితుల అభిప్రాయం. తెలుగులో ఆది కావ్యమైన మహాభారతావతరణకు పూర్వం ఆంధ్ర అనే పేరుతో ఉన్న పదానికి తరువాత కాలంలో తెలుగు అనే పర్యాయపదాలు విరివిగా కనిపిస్తూ క్రమేణా అవి ప్రాచుర్యంలోకి వచ్చాయి.

తెలుగు అనే పదం ఏర్పడడానికి ఈ దేశం ఓంకార రూపంగా, ద్రాక్షారామం, శ్రీశైలం, కాళేశ్వరం అనే మూడు పుణ్యక్షేత్రాలతో కూడి ఉన్నందున ఇది త్రిలింగదేశమనీ, క్రమేణా ఇది తెలుగుదేశంగా రూపాంతరం చెందిందనీ పూర్వం తెలంగులు అనే జాతివారు ఈ ప్రదేశాన్ని పరిపాలించినందున దీనికి 'తెలుగుదేశము' అనే పేరు ఏర్పడిందని భాషా శాస్త్రజ్ఞులభిప్రాయపడుతున్నారు. ఇక తెనుగు అనే మాట– తేనె అగు తెనుగు అనీ, అంటే ఈ భాష తేనెలాంటి తియ్యదనాన్ని కలిగి ఉంది కాబట్టి తెనుగు అనబడిందనీ కొందరు అభిప్రాయపడుతున్నారు. ఏది ఎలా ఉన్నప్పటికీ మన తెలుగు భాష అజంత భాష కావటం వల్ల అంటే అచ్చులతో అంతమయ్యే భాష– కాబట్టి అది మధురంగా, కర్ణపేయంగా ఉంటుందన్న విషయం అందరూ ఒప్పుకోవలసిందే. అయితే తెలుగు భాష ఈనాడు ఇంతటి ఉత్కృష్ట దశకు చేరుకోవటానికి దీని వెనుక ఎందరో మహనీయుల కృషి ఉంది. తెలుగుదేశం అనేక వంశాల రాజులు పలుకుబడితో అభివృద్ధి చెంది తేజరిల్లింది. తెలుగుదేశాన్ని మొట్టమొదట శాతవాహనులు పరిపాలించారు. తరువాత ఇక్ష్వాకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, ఆనందగోత్రీకులు, బృహత్పలాయనులు, పల్లవులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర రాజులు, నాయకరాజులు, బహమనీ సుల్తానులు, గోలుకొండ నవాబులు, నిజాం ప్రభువులు, బ్రిటీషువారు వరుసగా పరిపాలించారు.

11వ శతాబ్దిలో చాళుక్య రాజైన రాజరాజనరేంద్రుని ఆస్థానంలో ఉన్న నన్నయ భట్టారకుడు తెలుగు భాషగా మొట్టమొదట కావ్యత్వ గౌరవాన్ని ఆపాదించిన 'ఆదికవి'. అప్పటికీ ఒక మహా కావ్యానికి కావలసినంత పదజాలం, భాషా సామగ్రిలేని దశలో ఈ తెలుగు భాషను చేపట్టి, దానికొక సమగ్రతను, సామగ్రిని ఏర్పరచి, ఆ భాషలో ఒక మహా కావ్య నిర్మాణాన్ని కొనసాగించాడు. నన్నయ, అంతకు ముందు సంస్కృతం, ప్రాకృతం చెలామణిలో ఉన్న దశలో తెలుగులో ఒక్క కావ్యమూ వెలువడలేదు. ఎడనెడల శాసన పద్యాలు మాత్రం మిణుకుమిణుకుమంటూ ఒక గొప్ప తేజాన్ని స్వయం ప్రకాశాన్ని పుణికి పుచ్చుకుంది.

తెలుగుభాష శక్తివంతమై, సాహిత్యాన్ని పుష్టిమంతం చేయసాగింది. తెలుగు భాషలో ఎక్కువగా సంస్కృత పదజాలం కలిసి ఉండటం వల్ల ఇది సంస్కృత వాఙ్మయ గతిలోనే, గీతిలోనే, రీతిలోనే తన నడకను సాగించింది. అలతి అలతి పదాల కాహళి సంధించిన రీతి, మందార మకరంద తియ్యందనాలు కలిగి, తిక్కన, ఎర్రన, పోతన వంటివారల చేతిలో, శ్రీనాథుని సీసాలతో 'భట్టుమూర్తి' రామరాజ భూషణుని భాషా సాహిత్యం అనేక సొగసులు తీరంద. సొబగుల వెలార్చింది.

ఆంధ్ర వాఙ్మయంలో స్వర్ణయుగంగా పేర్కొనదగిన శ్రీకృష్ణదేవరాయల కాలంలో తెలుగు సాహిత్యం నలుమూలలా వ్యాపించాయి. రాయలు కొలువులోని అష్టదిగ్గజ కవులు తెలుగు సాహిత్యంలో ప్రబంధ ప్రక్రియను పరిపుష్టం చేసారు. కర్ణాటక చక్రవర్తి, స్వయంగా కన్నడిగుడియైన శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాషా సౌందర్యానికి ముగ్ధుడై 'దేశభాషలందు తెలుగు లెస్స' అని చాటడమే కాకుండా తెలుగులో 'ఆముక్త మాల్యద' అనే ప్రౌఢ కావ్యాన్ని విరచించాడు. అటు తరువాత తంజావూరు, మధుర, పుదుక్కోట, చెంజి మొదలైన ప్రాంతాలను పరిపాలించిన నాయక రాజుల కాలంలో తెలుగు సాహిత్యం అనేకవిధాలుగా పరిఢవిల్లింది. దాదాపుగా ఈ దశలోనే తెలుగు పదకవితలు వెలువడి, క్షేత్రయ్య, అన్నమయ్యలు, త్యాగయ్య, రామదాసు, సూరదాసు, వాగ్గేయకారుల వలన తెలుగు భాషా సాహిత్యాలు శ్రావ్యతతో బాటు సంగీత సురభిళాన్ని కూడా సంతరించుకుంది.

భాష ఒక జీవనది వంటింది. అది నిరంతరమూ పారుతూ మార్పులకు లోనవుతూ క్రొత్త రూపాన్ని పొందుతూ ఉంటుంది.

17వ శతాబ్దిలో ఈస్టిండియా కంపెనీ వారి రాకతో భారతదేశంలో సాహిత్యంలో కానీ, భాషలలో కానీ, పాశ్చాత్య సాహిత్య సంపర్కం జరగ నారంభించింది. తత్ఫలితంగా ఆధునిక యుగంలో భాషా స్వరూపంలో బహిరంగంగా అనేక మార్పులు వచ్చాయి. కందుకూరు వంటి సంస్కరణ వాదులు, గురజాడ వంటి భావోద్యమకారులు తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని క్రొత్తదారి మళ్ళించారు. దాని ఫలితముగానే ఈనాడు సాహిత్యంలో వ్యవహారిక భాష చోటు చేసుకుంది.

2500 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగుజాతి, ఉత్తమమై, ఉన్నతమైన సాహిత్యాన్ని నిర్మించిన తెలుగు భాష సహజసంపదలకు కాణాచియై అన్నపూర్ణగా విలసిల్లుతున్న తెలుగుదేశం నిజంగా ప్రపంచ దేశభాషా సాహిత్యాలలోకెల్ల ఉన్నతమైన దని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అందుకే అప్పయ్య దీక్షితులవంటి మహానుభావులు ఆంధ్రుడగుటయు, ఆంధ్రభాష చదువుటయు, బహుపూర్వజన్మలలోని తపస్సు యొక్క ఫలము అని అన్నారు.

ఇంతటి మహోన్నతమైన చరిత్ర కలిగిన భాషా సాహిత్యాలను, సంస్కృత సంప్రదాయాలను మరింత పటిష్టవంతం చేసుకునేందుకు, వాటిని సదా పరిరక్షించు కునేందుకు ప్రతి తెలుగువాడూ నిరంతరం శ్రమించవలసిన అవసరం ఎంతయినా ఉంది. ●

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

**మన భారతీయులలో ముఖ్యంగా హిందువులలో గంగా నదికి విశిష్టమైన స్థానం, గౌరవం, భక్తి, మర్యాద వుంది. సకల పాపాల నివారణిగా గంగా నదిని చెప్పకొంటాం. అటువంటి గంగానదిని దేవలోకం నుంచి భూలోకానికి తెచ్చిన భగీరథుని తలచు కొంటూ ఆయనను స్మరించు కుందాం.**

# భగీరథ ప్రయత్నము



లోకములో పట్టువిడువక చేసిన ప్రయత్నమునకు "భగీరథ ప్రయత్నము" అను నానుడి కలదు. ఆ నానుడికి కారణభూతుడు ఈ భగీరథుడే. దృఢ సంకల్పముతో పట్టువదలక గంగతల్లిని భూమికెట్లు రప్పించెనో చూతముగాక. గంగానది ప్రవహించునది స్వర్గలోకము నందు. అందుకే ఆమెకు "స్వర్ణది" యని, "సురదీర్గిక" యనియు పేర్లు. ఆ నదీమతల్లి ప్రవహించి నగరకుమారుల బూడిదరాశులను తడిపినచో వారికి ముక్తి కలుగునని కపిలుని వాక్యము. అందుకే భగీరథుడు ప్రయత్న శీలుడయ్యెను.

ఈ ప్రయత్నములో తన తండ్రియు, తాతయు విఫలురైనారని తెలిసియు భగీరథుడు పున:సంకల్పము చేసి కఠోర తపము నాచరించెను. అతని సంకల్ప దీక్షకు సంతసించి గంగమ్మ ప్రత్యక్షమై వరమడుగుమనెను. అందుకు భగీరథుడు "అమ్మా! నీవు భువిలో ప్రవహించి మా ముత్తాతల బూడిదకువలపై ప్రవహించి వారికి సద్గతిని కల్పింపుము" అని కోరెను. అందుకు గంగాభవాని "రాజా! నీ కోరిక మేరకు నేను భువికి దిగినచో నా వేగమునకు ఆగలేక భూమి చిట్లి పోగలదు. నేను పాతాళమునకు పోవలసివచ్చును, కావున నా వేగము నాపగల ధారణాపటిమ గలవారెవరైన నున్నారేమో చూడుము. మఱియొక ప్రతిబంధక మున్నది. భూమిలోని ప్రజలందరు తమ పాపములను నా జలములో కడుగుకొందురు. ఆ పాపాలరాశిని నేనెక్కడ కడుగుకొందును? ఈ విషయము కూడా ఆలోచింపుము" అనెను.

గంగ లేవనెత్తిన ఈ సందేహములకు వేఱొకరైనచో దిక్కుతోచక నిస్పృహకు లోనగువారు. కాని భగీరథుడు దీక్షకు మారుపేరైనవాడే కాక జ్ఞాన విజ్ఞాన సంపన్నుడు కనుక గంగతల్లితో "అమ్మా! నీ కేల సందేహము. మా భూలోకములో బ్రహ్మ నిష్ఠా గరిష్టులైన సాధువులున్నారు, వారు శాంతిమతులే కాక సందర్శన మాత్రమున జనులను పావనము చేయగలవారు. వారు నీ నీట క్రుంకులిడగా నిన్నంటియున్న పాపపంకిలము ప్రక్షాళన కాగలదు. ఇక వారికి పాపము లంటుకొనవా యని శంకింపబని లేదు. ఎందుకనగా పాపసంహారి యగు హరి వారియందే యుండి పాపములను బాపుచుండును. ఇంక నిన్ను ధరించు వారెవ్వరందువా, ఈ జగత్తంతయు ఎవరియందు ఓతప్రోతమై నిలిచియున్నదో ఆ రుద్రుడు నీ వేగభారము నవలీలగా ఆపగలడు" అని సమాధానమిచ్చెను. అందుకు గంగామాత "అట్లైన రుద్ర ప్రసాదమును సంపాదింపు"మని యంతర్ధాన మయ్యెను.

భగీరథుఁ డల్పకాలిక తపస్సుచేతనే శివుని మెప్పించెను శివుఁడు భగీరథుని కోరిక సమంజసమైనదనియు, గంగ భువికేతెంచినచో భూలోక భక్త శిఖామణులకు ముక్తి సులభోపాయ మగుననియు తలచి గంగను తన ఉత్తమాంగమున నిలుపుట కియ్యకొనెను. గంగయు భగీరథునిచే పునఃప్రార్థితయై సురలోకమునుండి హిమగిరిపై నిలుచుండి యున్న నిటలాక్షుని జటలలోనికి దూఁకెను.


**"భక్తవత్సలుండు ఫాలాక్షుఁ డా ఊగీ**
**రథుని మెచ్చి నిజశిరమునందు**
**శౌరిపాదపూత సలిలయై దివినుండి**
**ధరకు వచ్చు గంగఁ దాల్చెనపుడు"**

మెట్టగా శివుని జుట్టు లభించిన పిదప గంగతల్లి హిమాద్రిపైకి దూఁకి అటనుండి భగీరథుని రథము ననుగమించుచు సగరసుతులు భస్మీభూతమైన తావున ప్రవహించి ఆ భస్మపు కువలను తన పవిత్ర జలముచే ముంచెను. అంతటితో సగరపుత్రులందఱును స్వర్గప్రాప్తిని పొందిరి. ఈ కథానిక మూలకముగా పౌరాణిక శ్రేష్ఠులైన వ్యాస శుకులు మన మానవాళికందించిన తత్త్వములనేకము లున్నవి.

1. తండ్రులకు, తాతలకు పరమప్రాప్తి కలిగించుటకు ఆ వంశోద్భవులు ఎంతైనను కృషిచేయవలసియున్నది. 2. స్వర్గలోకమును, భూలోకమును అనుసంధానించు ఏకైక తత్త్వము ఆకాశగంగ. 3. విష్ణుపాదమున బుట్టినదగుటచే స్వర్గ లోకస్థులకు గంగ సుతీర్థము కాగా, శివ జటాజూట స్పర్శచే మఱింత మహత్వమును సంపాదించి భూలోకమున ఇంకను దివ్యమైన తీర్థమై వెలయుచున్నది. 4. గంగయందు మునిగిన ప్రాణులు దివ్యలోకముల కేగగలరు. 5. గంగలో మునిగిన పాపాత్ముల పాపము గంగను మలినము చేయగా, ఆ గంగలోనే మునుగు మునులు గంగ మలినమును ప్రక్షాళన చేయుదురు. కావున మునులతో సంగమము గంగస్నానమునకు మించిన పవిత్రత గలిగినది. 6. భగీరథుడు గంగకు భూమియందు మార్గము చూపిన వాడై, తన పితృదేవులకు స్వర్గ మార్గమును చూపినవాడై, సర్వమానవాళికి భవతరణ మార్గమును చూపిన మహనీయమూర్తి.

– **శ్రీ బాదామి జయరామగుప్త,** వేదాంతభేరి

Beautiful City - Beautiful Hotel



DO NOT MISS


Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# స్వామి రామతీర్థకు దేశమే దైవం

ఆధునిక భారతదేశ పునరుజ్జీవనానికి, పునః ప్రాణ చైతన్యానికి ఆచరణాత్మకమైన ప్రణాళికలు ప్రబోధించి ప్రకటించిన ఇద్దరు మహాపురుషులు స్వామి వివేకానంద, స్వామి రామతీర్థులు. వివేకానంద పుట్టిన (1863) పదేళ్ల తర్వాత స్వామి రామ తీర్థ (1873) జన్మించారు. వివేకానంద నిర్యాణం (1902) తర్వాత నాలుగేళ్లకే (1908) రామతీర్థ స్వామి తనువు చాలించారు. వీళ్లు మతాచార్యులు కారు. ఆధ్యాత్మికసిద్ధ పురుషులు అసలే కారు. సన్యాసాన్ని ఆదర్శంగా స్వీకరించి, అడవులలోకి కొండలలోకి వెళ్లి ముక్కుమూసుకుని తపస్సు చేయాలని కోరుకోలేదు. దేశాన్నే వాళ్లు దైవంగా అర్చించారు. దేశ ప్రజలను గూర్చి అలమటించారు. వాళ్ల దారిద్ర్యానికి కన్నీరు కార్చారు. అణగారిన వర్గాలవారిని గూర్చి అహరహం దుఃఖచేతస్కులైనారు. రాతిలో దేవుడు లేడు నీలోనే అంటే నీ సాటి మానవుడిలోనే దేవుణ్ణి దర్శించాలని ఆర్తితో, ఆవేదనతో, కరుణతో ఉద్బోధించారు. ఈ దేశమనే దొడ్డ వృక్షానికి సాంఘిక న్యాయానికి వంచితులైన వాళ్లే వేళ్లు అని, భోగభాగ్య సుఖకాంక్షలు ఆ చెట్టుకు పండే పండ్లు అనీ, మూలాలు లేకపోతే పండ్లు పండవనీ అందువల్ల మూలచ్ఛేదం జరగ కూడదనీ, అప్పుడు చెట్టు ఎండిపోతుందనీ కాబట్టి ఆ వేళ్లకు నీళ్లుపోసి వాతావరణ వైప రీత్యాలు నుంచీ రక్షించుకోవాలని రామతీర్థ స్వామి ప్రబోధించాడు. దేశీయులు నిరంతరం పనిచేసి సామాజిక సంపద, ఉద్పాదక శక్తులు వృద్ధికావాలనీ, ఇంటింట జీవనానందం వెల్లి విరియాలనీ గుడికన్న ఇల్లు ముఖ్యమనీ, పిల్లా పాపలతో సుఖసంతోష జీవనం స్వీకారార్హమనీ, సన్యాసం సాధించేది ఏమీ లేదని స్వామి రామతీర్థ ఆవేదన చెందారు. జపాను, అమెరికా లలో పర్యటించి స్వామి భారతీయ చింతన సంస్కృతిని, ధార్మిక జీవనాదర్శాలను, సామాజిక జనజీవన పురాతన స్థిత సువ్యవస్థను గూర్చి ఆయన ప్రసంగాలు చేశారు.



స్వామి రామతీర్థ

నేటి సాంఘిక అవ్యవస్థలో భారతీయులు ఆర్జించడం కన్నా త్యాగబుద్ధి నలవరచుకోవడం ముఖ్యమనీ, తీసుకోవడం కన్నా ఇవ్వడం నేర్చుకోవాలనీ, సొత్తు కూడబెట్టుకోవడంకన్నా చిత్త సంస్కారం పాటించాలని స్వామి రామతీర్థ ఉద్బోధించారు. చిరకాలాగతమైనంత మాత్రాన మత సాంస్కృతిక విశ్వాసాలేవీ ఉత్తమమైనవి అనుకోనక్కరలేదు. మతం ప్రాచీనమైనంత మాత్రాన అది సత్యమైనదనలేము. ఇటీవల కాలంలో పుట్టినదైనంత మాత్రాన మనం నూతన మతావిష్టులం ఎంతమాత్రం కాకూడదు. నవీన కాలపు జీవన పద్ధతులన్నీ మంచివి కావాల్సిన అగత్యం ఎంతమాత్రమూ లేదు. అధిక సంఖ్యాకులైన ప్రజానీకం ఆమోదించినమాత్రాన ఆ మతాచార జీవన సరళి ఆమోదయోగ్యం కానక్కరలేదు. ఏమంటే అధిక సంఖ్యాక జనులెప్పుడూ అధర్మ వర్తనులయ్యే వుంటారు. అజ్ఞానమూ, అవివేకమూ వాళ్లను అలరిస్తాయి. కాబట్టి నీ అనుభవమే నీకు సహాయపడాలి. నీ విచక్షణే నీకు ఆధారం కావాలి. నీ పరిశీలనే నీకు ముఖ్యం. ఊకనుంచి ధాన్యాన్ని నీవే వేరుపరచాలని స్వామి ప్రబోధించారు.

మన భవిష్యత్తును గతం దృష్ట్యా దర్శించకూడదు. మన భవితవ్యం గతంలో లేదు. గతంలో భవిష్యత్తును, భవిష్యత్తులో గతాన్ని తలపోయడం వ్యర్థప్రయత్నం. అట్లా అని గతమంతా అసంగతం అనుకోవడం కూడనిపని. అప్పుడు మంచి నుంచి వంచితులయ్యే ప్రమాదం పొంచుకొని వుంటుంది. పురాతన సామాజిక ధార్మిక వ్యవస్థలో జనులు నమ్మిన, ఆచరించిన కొన్ని విశ్వాసాలు పాటించారు. కొన్ని నమ్మకాలు ఆచరణలో చూపేవారు. వాటిని పరిత్యజించకూడదు. నష్టపెట్టుకోకూడదు అని హితబోధ చేశారు.

సన్యాస సంప్రదాయాన్ని ఆయన పూర్తిగా సమర్థించలేదు. వాళ్లు సమాజానికి పరువుకన్నా బరువుచేటు అని అభిప్రాయపడ్డారు.. పాచిపట్టి పసరుతేలిన జలచరం వల్ల దేశానికి ఉపయోగమేముంది? అయితే నిల్వనీటి కొలనులో అక్కడక్కడ వికసించి సువాసనలతో కూడిన పద్మాలు వుండవచ్చు. కాని ప్రవాహశీలత నీటికి అవసరం. సమాజంలో పనిచేయని వారుండకూడదు అని ప్రబోధించారు. ప్రచోదనం చేశారు సమాజానికి స్వామివారు. ఎప్పటివో పురాతనమైన, ఐతిహాసికమైన శ్రుతి స్మృతులను కూడా యథాతథంగా విశ్వసనీయ మైనవిగా స్వామి అంగీకరించలేదు. నేటి సామాజిక పరిణామాలను, సాంఘికావసరాలను నేటి దృష్టితో మనం విశ్లేషించుకోవాలి. ప్రాణవంతమైన వ్యవ స్థలో చైతన్యవంతమైన మార్పు తప్పదు. అయితే మూలచ్ఛేదం కూడదు. మృతాచారాలను అను సరించకూడదు. సమాజ పురోభివృద్ధి ఎప్పుడూ బహుజనసహితం కోసం సాగిపోతూ వుండవల సిందే! వేదయుగాల కర్మకాండ నేడు అనుసర ణీయం కాదంటే శాస్త్రాలను ఈనాటి మానవ వికాసం కోసం సమన్వయింప చేసుకోవలసి వుంటుందన్నారు స్వామి రామతీర్థ. భగవద్గీత, ఉపనిషత్తులు, యోగవాసిష్టం మనకు నిత్యోప యోగం కావాలన్నారు.

స్వామి రామతీర్థ గొప్ప మేధావి. గణిత శాస్త్రంలో ఆయన ప్రజ్ఞానిధి. ఆయన లాహోర్ కళాశాలలో కొన్నాళ్లు గణితశాస్త్రాచార్యులుగా పనిచేశారు. ఆయన ఉర్దూ, పర్షియన్, సంస్కృత భాషలలో గొప్ప విద్వాంసుడు. 'ఆలిఫ్' పేరున ఒక ఉర్దూ పత్రికను అయన కొన్నేళ్లు నడిపారు. ఆయన తత్త్వచింతనమూ, నవీన భారతదేశ సమస్యలూ, పరిష్కారాల్నూ ఆయన ఆరాధించేవారు. ఎప్పుడూ ఓంకారం పరమ నాదమధురంగా ఉచ్చరిస్తూ వుండేవారు. ఆ నాదోపాసనతో ఆయన పరిసరాలు సమస్త చరాచర ప్రకృతి సమ్మోహితమవుతూ వుండేది. ఆయనను సమీపించిన ప్రతివారూ ముగ్ధులవుతూ వుండేవారు. ఆయన చుట్టూ ఏదో దివ్య సన్నిధి ప్రకాశిస్తున్నట్లు ఇతరులకు అనుభవానికి వస్తుండేది. ●

**కన్యాకుమారి నా పాదభూమి. హిమాలయాలు నా శిరోరుహాలు. నా తల శిరోజాల కుదుళ్లలో గంగ పుట్టింది. నా శిరస్సు నుంచి బ్రహ్మపుత్ర, సింధు నదులు రూపుదాల్చాయి. వింధ్య పర్వత శ్రేణి నా నడుము దట్టీ. మలబార్, కోరమండల్‌లు నా రెండు కాళ్లు. భారతదేశపు తూర్పు పడమర ప్రదేశాలు నా చేతులు. ఆ రెండు చేతులూ చాచి సమస్త విశ్వాన్ని నేను కౌగిలిస్తాను అన్నారు స్వామి రామతీర్థ. అదే ఆయన దేశభక్తికి నిదర్శనం.**

– అక్కిరాజు రమాపతిరావు (ఆంధ్రభూమి సౌజన్యం)



# అచ్చ తెలుగు స్త్రీ తేజం
# అచ్చమాంబ

**స్త్రీలలో సెలబ్రిటీలెవరు అని మన కాలేజీ పిల్లల్ని అడిగితే టక్కున హీరోయిన్ల పేర్లు చెబుతారు. అందం, అంగాంగ ప్రదర్శనం, డబ్బు, వెర్రి అభిమాన జనం.. ఇవే కదా కొలతలు! మన తెలుగింటి ఆడపడుచు ఒకామె పుట్టింది కోస్తాలో, బాల్యం తెలంగాణాలో, ఎదిగింది మహారాష్ట్రలో. పదేళ్లకే పెళ్లి జరిగింది. స్కూలు ముఖం తెలీదు. అయితేనేం తొలి కథ రాసింది ఆమే. మొదటి స్త్రీ సమాజాన్ని స్థాపించింది ఆమే. స్త్రీల చరిత్ర రాసి ప్రథమురాలైంది. అనాథల్ని అక్కున చేర్చుకుంది. స్త్రీ చైతన్య స్ఫూర్తి ప్రదాత అయింది. ఇంతా చేసి ఆమె 30 ఏళ్లే జీవించింది. ఆమె పేరు భండారు అచ్చమాంబ.**

అచ్చమాంబ కృష్ణాజిల్లా నందిగామలో 1874లో పుట్టింది. తండ్రి కొమర్రాజు వెంకటప్పయ్య, తల్లి గంగమాంబ. అచ్చమాంబకి వేంకట లక్ష్మణరావు అనే తమ్ముడున్నాడు. ఆమె ఆరేళ్లప్పుడు తండ్రి మరణించాడు. ఆ కుటుంబం నంది గామలో ఉండలేని దుస్థితి ఏర్పడింది. అచ్చమాంబ తల్లి పిల్లల్ని తీసుకుని నల్గొండ జిల్లా దేవరకొండకు వెళ్లిపోయింది. సవతి తమ్ముడు భండారు మాధవరావు పంచన చేరింది. అతడు నిజాం సర్కారులో ఉద్యోగి. అప్పటికే పెళ్లయ్యింది. ఓ కూతురు. భార్య మీనాక్షి చనిపోయింది.

అచ్చమాంబ చిన్నతనం గడిచిందంతా దేవరకొండలోనే. ఎప్పుడూ కేరింతలు కొడుతూ, తమ్ముడ్ని ఆడిస్తూ, మీనాక్షికి తానే తల్లిలా దీపంలా జీవించింది. చిన్నపిల్ల అయినా చకచకా ఇంటిపనులు చేసేది. అంతలో ఆమెకు పదేళ్లొచ్చాయి. పెళ్లీడొచ్చిందని కంగారుపడింది తల్లి. ఆ రోజుల్లో అంతే! బయటి సంబంధం తెచ్చే స్తోమత లేదు. తమ్ముడికి భార్య లేదు. లోకం తెలీని అమాయకురాలు. అచ్చమాంబ ఆయన ఇల్లాలైంది. కొమర్రాజు అచ్చమాంబ కాస్తా భండారు అచ్చమాంబ అయ్యింది. అంతలో మాధవరావుకి నాగ్‌పూర్ బదలీ అయ్యింది. భర్తతోపాటు అచ్చమాంబ, వారితోపాటు గంగమాంబ, మీనాక్షి, లక్ష్మణరావు.. మరాఠా ప్రాంతానికి వెళ్లిపోయారు. పన్నెండేళ్లు వచ్చేసరికి అచ్చమాంబ ఇంటిపెద్ద. తల్లి సాయంతో ఇంటి పనంతా తానే చేసేది. మీనాక్షిని కంటికి రెప్పలా చూసుకునేది. తమ్ముడికి చదువు చెప్పేందుకు రోజూ ఓ మాస్టారు ఇంటికొచ్చేవారు. ముగ్గులు పెడుతూ, కుట్లు అల్లుతూ, ఊరగాయ పెడుతూ.. తానూ ఆ పాఠాలు వినేది. అలాగే హిందీ, సంస్కృతం, గుజరాతీ నేర్చుకుంది. తమ్ముడితో కూర్చుని తెలుగు పుస్తకాల్ని చదవడం మొదలెట్టింది. చుట్టుపక్కల అమ్మలక్కలతో చనువుగా ఉండేది. పట్టుమని 15 ఏళ్లు కూడా లేని ఆమె చలాకీతనం అందరినీ దగ్గర చేసింది. తనకు మరాఠీ రాదు. వాళ్లకు తెలుగు రాదు. కానీ అందరినీ పోగేసి మీటింగులు పెట్టేది. మరాఠీ భక్తి సాహిత్యాన్ని సంఘసంస్కరణ సాహిత్యాన్ని చదవగలిగేంత వరకూ చదువు వచ్చింది.

మరాఠీలోని 'ఆనందీబాయి చరిత్ర' చదివాక, అచ్చమాంబలో చెప్పలేనంత మార్పు, అంతవరకు అణగి ఉన్న ఆమెలోని అబలా చైతన్యం పెల్లుబుకింది. అచ్చమాంబకు ఇద్దరు పిల్లలు పుట్టారు. పదేళ్లు నిండకుండానే మీనాక్షికి కూడా పెళ్లి చేసేశారు. అత్తారింటికి పంపేశారు. ఇంతలో తమ్ముడు పెరిగి పెద్దవాడయ్యాడు. బీఏ పూర్తి చేశాడు. ఎంఏ కోసం కలకత్తా వెళ్లాడు. సెలవులకొచ్చిన ప్రతీసారీ కొత్త కొత్త పుస్తకాలు తెచ్చేవాడు. తేవడంతోనే చదివేసేది.

కొని విషాదాలు ఆమెను తోసుకుంటూ వచ్చాయి అచ్చమాంబ బతుకులోకి. కాపురం కలకాలం సాగకుండానే మీనాక్షి భర్త చనిపోయాడు. పుట్టెడు దుఃఖంతో పుట్టింటికొచ్చేసింది మీనాక్షి. ఆమెను గుండెలకు హత్తుకుని ధైర్యం చెప్పింది అచ్చమాంబ. కానీ అప్పుడాలోచించింది. మీనాక్షిలా జీవితంలో భరించలేని కష్టాలు పడుతున్న అభాగినులెందరో! తనకు తోచిన నాలుగు మాటల్ని కాగితంపై పెడితే, వాటిని చదివినవారు ఒక్కరైనా స్థైర్యం పొందితే జీవితం ధన్యం. అలా తొలిసారి 24 ఏళ్ల వయసులో కలం పట్టింది. 1898 ఆగస్టు 'తెలుగు జనానా' పత్రికలో ఆమె తొలి వ్యాసం వచ్చింది. ఇక ఆ వ్యాసపరంపర ఆగలేదు ఉద్యమంగా మారింది. స్త్రీలలో తేజం నింపింది. ●

## తల్లికి సరైన నిర్వచనం

ఒకామె వీసా అప్లికేషన్ కోసం వెళ్ళినప్పుడు అక్కడి అధికారి అప్లికేషన్ ఫారం పూర్తి చేస్తూ "మీరేం పని చేస్తూ ఉంటారు" అని అడిగాడు ."తల్లిని" అన్నది

అధికారి కొంచెం అయోమయంగా, "ఇక్కడ 'తల్లి' అన్న ఆప్షన్ లేదు మేడమ్. మీ వృత్తి ఏమిటి?" అని అడిగాడు.

"పిల్లల అభివృద్ధి అనే అంశంపై నేను రీసెర్చ్ స్కాలర్ని" అని సమాధానం ఇచ్చింది గృహిణి.

అధికారి మరింత అయోమయంతో "మీరు ఈ రీసెర్చ్ ఎక్కడ చేస్తున్నారు?" అని ప్రశ్నించారు.

"మా ఇంట్లో" అన్నది తల్లి. అధికారి మరింత అయోమయంతో చూసారు.

"ఈ రీసెర్చ్ చాలా సంవత్సరాల నుంచి చేస్తున్నాను. రోజుకి పద్నాలుగు గంటలు పని చేసినా పూర్తి అవ్వదు. దీనికి నాకు మార్గ దర్శకులు నా భర్త. సీనియర్ రీసెర్చ్ గైడ్, స్కాలర్స్ మా అమ్మ. ..! మా తాతమ్మ, అమ్మమ్మ, నానమ్మ. వీళ్ళందరూ నా యూనివర్సిటీ డైరెక్టర్లు. మా అత్తగారు అప్పుడప్పుడు నా పేపర్స్ దిద్దుతూ ఉంటుంది.

ఇప్పటికే నాకు రెండు డిగ్రీలు వచ్చాయి. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి" అంటూ ముగించింది.

అధికారి ఆమెతో పాటూ గుమ్మం వరకు వచ్చి, కరచాలనం చేసి సాగనంపుతూ "తల్లికి ఇంతకన్నా గొప్ప నిర్వచనం నా జీవితంలో నేనెప్పుడూ వినలేదు మేడమ్. థాంక్స్" అన్నాడు

**మాతృదేవోభవ...**

# ఉత్సాహంగా జరిగిన తెలుగు విద్యార్థులకు జర్నలిజంపై అవగాహనా కార్యశాల






అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి, తేజస్ (తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్) సంయుక్తధ్వర్యంలో జర్నలిజంపై మూడు రోజుల కార్యశాల ఉత్సాహంగా జరిగింది. శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల, డి ఆర్ బి సి సి హిందూ కళాశాలల తెలుగు విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల వేదికగా జరిగింది. సోమ, మంగళ, బుధవారాలలో వార్తలు రాయడం, చదవడం, స్పాట్ రిపోర్టింగ్, టీవీ వ్యాఖ్యానం (యాంకరింగ్), ఛాయాగ్రహణం, వీడియో చిత్రీకరణ తదితర అంశాలలో శిక్షణను వివిధ వార్తా సంస్థలలో పని చేస్తున్న సంజయ్ గుండ్ల, జవహర్, శ్రీనివాస్, గోటేటి వెంకటేశ్వరరావు, సురేష్, విక్కీలు, ఫ్రీలాన్సర్లుగా ఉన్న మాధురి, నవీన అందించారు. మూడు రోజుల కార్యశాలపై విద్యార్థులు రాసిన నివేదికలను పరిశీలించి ఎంపికైనవాటికి నగదు బహుమతులను ఇవ్వనున్నట్లు తమ "ప్రముఖాంధ్ర" పత్రిక తరఫున గోటేటి ప్రకటించారు.

లా విద్యార్థి, ఔత్సాహిక ఛాయాగ్రాహకుడు గుడిమెళ్ళ వినయ్ దత్త, సాహిత్య అభిమాని శారదా రమేష్ కార్యక్రమ నిర్వహణకు సహకరించారు. అధ్యాపకులు మైథిలి, చామర్తి మాధవిలు పాల్గొన్నారు. చివరి రోజున అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి కార్యవర్గ సభ్యులు చాడా శ్రీనివాస్, కల్పన పాల్గొన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, వారి భవిష్యత్తు కోసం ప్రతి సంవత్సరం కార్యక్రమాలను, శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయగలమని శ్రీనివాస్ వెల్లడించారు.

కన్యకా పరమేశ్వరి కళాశాల ప్రిన్సిపాల్ మోహనశ్రీ పర్యవేక్షించారు.

కార్యశాల ముగింపు సందర్భంగా 'విద్యార్థి విలేఖరుల క్లబ్' ను సంజయ్, మాధవి, మైథిలిలు ప్రారంభించి విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందజేశారు.

# ఆయుష్మాన్ భవ

పెద్దలు వస్తుండగా లేచి వెళ్ళి నమస్కరించడం మంచి సంప్రదాయం. దాన్ని అభ్యుత్థానమని, అభివాదనమని అంటారు. దానివల్ల ఎన్నో ప్రయోజనాలు సిద్ధిస్తాయని స్మృతులు చెబుతున్నాయి. నమస్కారాల్లో సాష్టాంగ ప్రణామం ఉత్తమం. దానికే ప్రణతి అని పేరు. అంటే గొప్పదైన నమస్కారమని అర్థం.

సంప్రదాయం తెలిసిన పెద్దలకు నమస్కరించినప్పుడు 'ఆయుష్మాన్ భవ' అని దీవిస్తారు. చాలాసార్లు ఆ మాట విని ఉండటంవల్ల వారేదో అలవాటుగా ఆశీర్వదించారని మనం అనుకొంటాం. నిజానికది అద్భుతమైన ఆకాంక్ష. చాలా విలువైన దీవెన. ఆ ఆశీస్సులో రెండు గొప్ప పదాలున్నాయి. వాటిలో ఆయుష్మాన్ అనేది యోగాల్లో మూడోది. భవ అనేది కరణాల్లో మొదటిది.

మన అందరికీ పంచాంగం ద్వారా ఎన్నో విశేషాలు తెలుస్తున్నా– తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే అయిదూ దానిలో ప్రధానమైన అంగాలు. అవి వరసగా శ్రేయస్సు, ఆయువు, పాపవిముక్తి, రోగ నివారణ, కార్యసిద్ధికి సంబంధించినవి. ఆ అయిదింటి శుభ అశుభ ఫలితాలను పంచాగం వెల్లడిస్తుంది. నిత్యం పూజావిధిలో ఆ అయిదు అంగాలనూ సంకల్పంలో చెబుతారు.

తెలుగువారి పంచాంగాలకు చాంద్రమానం ఆధారం. చంద్రుడి నడకనే చాంద్రమానం అంటారు. భూమి చుట్టూ తిరిగే చంద్రుడు షోడశ కళాప్రపూర్ణుడు. అంటే పదహారు కళలున్నవాడు. వాటినే తిథులు అంటారు. పాడ్యమి మొదలు పున్నమి వరకు, తిరిగి పాడ్యమినుంచి అమావాస్య వరకు విదియ, తదియ, చవితి, పంచమి అంటూ పౌర్ణమి/అమావాస్యతో కలిసి శుక్లపక్షం, కృష్ణపక్షం అని నెలకు రెండు పక్షాలున్నాయి.

పంచాంగంలో రెండో విభాగం– వారం. ఆదివారం నుంచి శనివారం వరకు ఏడు వారాలవి. నక్షత్రం అనేది పంచాంగంలో మూడో విభాగం. అశ్వని, భరణి, కృత్తిక, రోహిణి... నుంచి రేవతి వరకు మొత్తం 27 నక్షత్రాలు. ఒకో నక్షత్రానికి నాలుగు పాదాలు చొప్పున మొత్తం 108 పాదాల్లో సృష్టిలోని ప్రతి జీవీ ఇమిడిపోతుంది. పుట్టిన ప్రతి మనిషికీ ఒక్కో నక్షత్రం ఒక్కో పాదం స్థిరపడతాయి. అష్టోత్తరశత నామావళి సంప్రదాయానికి ఇదే పునాది. ఆ 108 నామాల్లో ఒకటి ప్రతి మనిషికీ అనువర్తిస్తుంది. ఉపాసకులకు అదే ఆధారం. తమ నక్షత్రానికి చెందిన పాదానికి, 108లో ఒక నామానికి సమన్వయం తెలుసుకొని, సంపుటీకరణ ప్రక్రియను ఉపాసకులు ఆచరిస్తారు.

పంచాంగంలో నాలుగోది యోగం. యోగాలూ ఇరవై ఏడే. విష్కంభం, ప్రీతి, ఆయుష్మాన్, సౌభాగ్య, శోభన నుంచి వైధృతి వరకు 27 యోగాల్లో కొన్ని శుభ ఫలితాలకు, మరికొన్ని అశుభ ఫలితాలకు కారణమవుతాయి. ఆయుష్మాన్ అనేది వీటిలో చాలా మంచి యోగం. ●


**Statement about ownership and other particulars about Newspaper**
**"PRAMUKHANDRA" Chennai - 600 004.**
**FORM IV (See Rule 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Chennai |
| 2. | Periodicity of its Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | Printed at **Goteti Graphics** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 4. | Publisher's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 5. | Editor's Name | : | **G.S. RAMARAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 6. | Name & Address of individuals who own the Newspaper and Partners | : | **GV RAO** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |

I, **G.V. RAO** hereby declare the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 29-2-2020 **(Sd.,) GV RAO**
Chennai - 600 033. PUBLISHER

శ్రీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

# సౌశీల్యమే జాతికి ప్రాణం

- స్వామి వివేకానంద

## కె.సి.పి. సంస్థల అధినేత వెలగపూడి లక్ష్మణ్‌దత్ మృతి



గాంధేయవాధి, సామాజిక సేవకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త కెసిపి లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ వెలగపూడి లక్ష్మణదత్ గారి మరణవార్త పారిశ్రామిక వర్గాలనూ, ఆయన అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన వి.యల్.దత్‌గా సుపరిచితులు. ఆయన కృష్ణా, గుంటూరు జిల్లాలలో పలు భారీ పరిశ్రమలను స్థాపించారు. అందులో చక్కెర, సిమెంట్, సౌర పవన విద్యుత్ ముఖ్యమైనవి. భారతదేశంలోనేగాక ఆయన వియత్నాంలోను భారీ చక్కెర కర్మాగారాలను స్థాపించారు.

ఫిక్కి అధ్యక్షుడిగా, ఇండియన్ ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా బోర్డు సభ్యునిగా, ఆంధ్ర ఛాంబర్, సిమెంట్ ఉత్పత్తిదారుల సంఘం, ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆయన ఎనలేని సేవలను అందించారు. వాటికై ఎంతో కృషి చేసారు. ఆయన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎనలేని కృషి సల్పారు.

**ఆయనను వరించిన గౌరవాలు**

గ్రామీణాభివృద్ధి, ప్రజారోగ్యం, విద్య, పారిశ్రామిక రంగాల్లో ఆయన చేసిన కృషికిగాను నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అందజేసింది. తమిళనాడు, పాండిచ్చేరి, ఆంధ్ర, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో రిపబ్లిక్ ఆఫ్ టర్కి రాయభారి గాను వ్యవహరించారు. రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం అధ్యక్షుడు "మెడల్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ అవార్డును శ్రీ దత్ గార్కి అందించారు.

నాయుడమ్మ మెమోరియల్ సైన్స్ ఫౌండేషన్, ఇండియన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వంటి సంస్థల అభివృద్ధికి దత్ ఎంతగానో కృషి చేసారు.

తండ్రి శ్రీ రామకృష్ణ స్థాపించిన కె.సి.పి. సంస్థల బాధ్యతను చేపట్టి ఆ సంస్థ ఉన్నతస్థాయికి కృషి చేసారు. సామాజిక సేవా లక్షణం కలిగిన దత్ గారు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే, విద్యాలయాలు, వైద్యశాలలు నెలకొల్పారు. ప్రస్తుతం కె.సి.పి. సంస్థలకు మేనేజింగ్ డైరెక్టర్‌గా శ్రీమతి ఇందిరా దత్‌గారు, జాయింట్ మేనేజింగ్ డైరక్టర్‌గా కవితాదత్ గార్లు వ్యవహరిస్తున్నారు.

**సంతాపం**

శ్రీదత్ గారి మృతికి ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యనాయుడు, ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణా ముఖ్యమంత్రి శ్రీ కె.సి.ఆర్, శ్రీ చంద్రబాబు నాయుడు, పలువురు పారిశ్రామికవేత్తలు, తెలుగు ప్రముఖులు విచారం వ్యక్తం చేసారు. ఆయన భౌతికకాయానికి ఆయన నివాసంలో ప్రముఖులందరూ నివాళులర్పించారు.

**వి.యల్.దత్ గారితో ప్రముఖాంధ్ర అనుబంధం**

దత్‌గారితో నాన్నగారు గోటేటి శ్రీరామారావు గారిది 25 ఏళ్ల బంధం. ప్రముఖాంధ్ర ప్రారంభానికి దత్‌గారు ముఖ్య కారకులు. 1995 ప్రపంచ తెలుగు సమాఖ్య ఆవిర్భావానికి ముందుగా కొన్ని నెలల కృషిలో నాన్నగారి వంతు కూడా వుంది. అప్పటిలో తెలుగువారి కోసం ఒక పత్రికను తీసుకురావాలని నిర్ణయించుకుని ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రారంభోత్సవ సభలో విడుదల చెయ్యాలని నిర్ణయం తీసుకున్నప్పుడు వి.యల్.దత్ గారు ప్రోత్సహిస్తు మొదటి సంచికకు అయ్యే మొత్తం ఖర్చును ఆయనే వారి కె.సి.పి. సంస్థల ప్రకటన ద్వారా అందజేశారు. నాన్నగారు ఎప్పుడు అంటూ ఉంటారు. ఆయన హస్తవాసి మంచిది కాబట్టే ప్రముఖాంధ్ర పత్రిక 25 సంవత్సరాలుగా వస్తూనే వుంది అంటూండేవారు. శ్రీ దత్ గారి మరణం ఆయన అభిమానిగా ఆత్మీయులుగా మాకెంతో బాధ కలిగించింది.